




www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

MONDAY 31ST AUGUST 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 166 COST : 3\- KHAMMAM, TELANGANA

సోమవారం 31 ఆగస్టు 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :166 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## రేపటితో ప్రజాప్రభుత్వానికి 1000 రోజులు

ఈ మూడేళ్లలో సంక్షేమం, ప్రగతి పరుగులు

హైదరాబాద్, ఆగస్టు30 ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం మంగళవారంతో (సెప్టెంబర్ 1నాటికి) వెయ్యి రోజుల మైలురాయిని పూర్తిచేసుకుంటోంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను అందించడం, సంక్షేమానికి, సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడం.. రైతు, యువజన, మహిళా శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇస్తూ.. రాష్ట్ర సంపదను పెంచడమే లక్ష్యంగా ప్రజాపాలన దూసుకుపోతోందని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకుని రావడంలో, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు నిర్మించడంలో ఈ వెయ్యి రోజుల పాలన కొత్త అధ్యాయాన్ని నమోదు చేసిందని ఆదివారం ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి..



- అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమేనన్న టీపీసీసీ చీఫ్
- రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి
- సెప్టెంబర్ నాటికి పార్టీలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా
- అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీపై వచ్చే నెలలో స్పష్టత
- కాంగ్రెస్ ఒక మహాసముద్రమని,

**అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉంటుందని వ్యాఖ్య**

హైదరాబాద్, ఆగస్టు 30తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని

➢ మిగతా 2వ పేజిలో..




## ప్రశ్నించిన విద్యార్థులను శిక్షించడం సరికాదు

- అలాంటి చర్యలు రాజ్యాంగానికి శోభను ఇవ్వవు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ వ్యాఖ్యలు
- న్యాయకోవిదులను జడ్జిలుగా నియమించాలని సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 30: భిన్నాభిప్రాయాలను కలిగిన విద్యార్థులను ప్రశ్నించారనే కారణంగా శిక్షించడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అన్నారు. స్థిరపడిపోయిన విషయాలతో విభేదించడానికి, ప్రశ్నించడానికి తగిన వేదికగా

➢ మిగతా 2వ పేజిలో..



## రష్యాకు భారత్ పెట్రోల్ ఎగుమతి

- డ్రోన్ దాడులతో రిఫైనరీలకు దెబ్బ
- 10 లక్షల బ్యారెళ్ల సరఫరా చేసిన భారత్...
- ముడి చమురు దిగుమతిదారుగా.. పెట్రోల్ ఎగుమతిదారుగా భారత్ వ్యూహాత్మక ఎదుగుదల

న్యూఢిల్లీ, ఆగస్టు 30 అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో అరుదైన పరిణామం చోటుచేసుకుంది. సాధారణం గా రష్యా నుంచి భారీగా ముడి చమురు దిగుమతి చేసుకునే భారత్.. ఇప్పుడు అదే దేశానికి పెట్రోల్ ఎగుమతి చేసే కీలక దేశంగా అవతరించింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రష్యాలోని పలు చమురు శుద్ధి కర్మాగారాలు దెబ్బతినడంతో దేశీయ ఇంధన ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో రష్యా తన అవసరాలను తీర్చుకునేందుకు విదేశాల నుంచి పెట్రోల్ దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.వోర్టెక్సా అనే అంతర్జాతీయ ఎనర్జీ అనలిటిక్స్ సంస్థ వివరాల ప్రకారం.. గత రెండు నెలల్లో రష్యా రిఫైనరీలపై సుమారు 32 డ్రోన్ దాడులు జరిగాయి. వీటి ప్రభావంతో దేశీయ పెట్రోల్ ఉత్పత్తి గణనీయంగా తగ్గినట్లు అంచనాలు ఉన్నాయి. ఇంధన కొరత కారణంగా రష్యాలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు భారీగా బారులు తీరాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు రష్యా ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై

➢ మిగతా 2వ పేజిలో..

# రాజీనామా చేయిస్తారు!

- కొండా సురేఖను సామరస్యంగా..ఇంటికి పంపించే యోచనలో అధిష్ఠానం!
- చిన్నారెడ్డిని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవికి రాజీనామా కోరే చాన్స్
- వారంలోనే నిర్ణయం.. తద్వారా పార్టీలోని ఇతర నేతలకు గట్టి సంకేతాన్నిచ్చే యోచన
- నేడు అమెరికా నుంచి వేణుగోపాల్ రాక
- రేపు ఢిల్లీకి వెళ్లనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- తుమ్మిడిహెట్టిపై సీడబ్ల్యూసీ భేటీలో పాల్గొననున్న సీఎం, ఉత్తమ్



హైదరాబాద్, ఆగస్టు 30 మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించి కాంగ్రెస్ అధిష్ఠానం ఈ వారంలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాలకు ముందుగానే దీనికి ఒక ముగింపు పలకాలన్న భావనలో ఉన్నట్లు సమాచారం. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై కఠినంగానే చర్యలు తీసుకుని.. క్రమశిక్షణ విషయంలో మిగిలిన నాయకులకు స్పష్టమైన సంకేతాన్నివ్వాలన్న యోచనలో అధిష్ఠానం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించడం కాకుండా.. మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిందిగా ఆమెను కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చిన్నారెడ్డిని సైతం ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని కోరే అవకాశం ఉందంటున్నారు.

మరోవైపు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టి కొత్తవారికి అవకాశం ఇచ్చే పేరుతో కొండా సురేఖను తప్పిస్తారన్న ప్రచారం కూడా ఉంది. కానీ, క్రమశిక్షణ విషయంలో అధిష్ఠానం కఠినంగా ఉందని సంకేతాలు ఇవ్వదలచుకుంటే మాత్రం రాజీనామా కోరే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని అంటున్నారు. కఠిన చర్యలు తీసుకోని పక్షంలో సీఎం రేవంత్‌రెడ్డిని, ఆయన నేతృత్వంలోని ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచినట్లే అవుతుందన్న భావనకు అధిష్ఠానం వచ్చినట్లు చెబుతున్నారు. ఈ విషయంలో ఉపేక్షిస్తే భవిష్యత్తులో ప్రతి చిన్న అంశానికీ పార్టీ, ప్రభుత్వ నాయకత్వాలపై విమర్శలు చేసేవారు

➢ మిగతా 2వ పేజిలో..



## ఆగస్టులో 36 శాతం లోటు వర్షపాతం

- ఆగస్టులో 36 శాతం లోటు వర్షపాతం
- 17 జిల్లాల్లో ఇదే పరిస్థితి
- గతేడాది ఇదే నెలలో వదలకుండా వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 30 భారీ వర్షాలు కురవాల్సిన ఆగస్టులో అంతంత మాత్రంగానే వర్షాలు పడటంతో తెలంగాణలో సగానికిపైగా జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. 17 జిల్లాల్లో

➢ మిగతా 2వ పేజిలో..

## 2030 నాటికి 5 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం

- భారత్--ఉజ్బెకిస్తాన్ మధ్య విస్తృత సహకారానికి అడుగులు
- మోదీ పర్యటనలో కీలక ఒప్పందాలు.. బంధానికి కొత్త బలం
- సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అప్‌గ్రేడ్
- మౌలిక వసతులు, కృత్రిమ మేధలో సహకారం విస్తరణ
- ప్రధాని నరేంద్ర మోదీ



తాష్కెంట్, ఆగస్టు 30 భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్కత్ మీర్జియోయేవ్ మధ్య తాష్కెంట్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చలు కీలక ఫలితాలను ఇచ్చాయి. ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ వాటిని సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం ద్వారా రాజకీయ, ఆర్థిక, సాంకేతిక, భద్రతా రంగాల్లో సహకారం మరింత బలోపేతం కానుంది. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు ఇరు దేశాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై దృష్టి సారించాయి. ప్రస్తుతం ఉన్న వాణిజ్య స్థాయిని గణనీయంగా పెంచుతూ 2030 నాటికి 5 బిలియన్ డాలర్లకు పైగా వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం

➢ మిగతా 2వ పేజిలో..

## కేరళలో చికిత్స... ఏపీలో పాలన

- ఫైళ్లపై సమీక్ష.. నిర్ణయాల్లో వేగం
- ప్రజా సమస్యలపై పవన్ నిరంతర పర్యవేక్షణ
- పర్యావరణం నుంచి పుణ్యక్షేత్రాల వరకు ప్రత్యేక దృష్టి

అమరావతి, ఆగస్టు 30 : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వైద్య చికిత్స నిమిత్తం కేరళలో ఉన్నప్పటికీ ప్రభుత్వ వ్యవహారాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఈ నెల 22న చికిత్స కోసం కేరళకు వెళ్లిన ఆయన అక్కడి నుంచే శాఖల పనితీరును సమీక్షిస్తూ,

➢ మిగతా 2వ పేజిలో..

## రష్యాకు భారత్ పెట్రోల్ ఎగుమతి

ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో భారత్ రష్యాకు పెట్రోల్ సరఫరా చేస్తోంది. జూలై, ఆగస్టు నెలల్లో భారత్ నుంచి దాదాపు 10 లక్షల బ్యారెళ్ల పెట్రోల్ రష్యాకు ఎగుమతి అయినట్లు వాణిజ్య వర్గాలు వెల్లడించాయి. భారత్‌తో పాటు తుర్కియే, మొరాకో కూడా రష్యాకు ఇంధనాన్ని సరఫరా చేస్తున్నాయి. గుజరాత్‌లోని వడినార్‌లో ఉన్న నయారా ఎనర్జీ రిఫైనరీ నుంచే ఈ ఎగుమతుల్లో అధిక భాగం జరిగినట్లు సమాచారం. ఈ రిఫైనరీలో రష్యా ప్రభుత్వ రంగ సంస్థ రాస్‌నెఫ్ట్‌కు వాటా ఉండటం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.

### రిఫైనింగ్ సామర్థ్యంపై భారత్ దృష్టి

ప్రపంచంలో మూడో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా ఉన్న భారత్.. తన శుద్ధి సామర్థ్యాన్ని మరింత పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న 272 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక రిఫైనింగ్ సామర్థ్యాన్ని 300 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచే చర్యలు కొనసాగుతున్నాయి. దీంతో భారత్ ఆసియాలోనే కాకుండా ప్రపంచ ఇంధన మార్కెట్లోనూ కీలక రిఫైనింగ్ కేంద్రంగా ఎదుగుతోందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి పేర్కొన్నారు.

### 27 దేశాల నుంచి 41 దేశాలకు..

అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు, హర్మూజ్ జలసంధికి సంబంధించిన ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ తన ముడి చమురు దిగుమతి వనరులను కూడా విస్తరించింది. గతంలో 27 దేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకున్న భారత్.. ప్రస్తుతం 41 దేశాల నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ప్రపంచ మార్కెట్లో అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ దేశ ఇంధన భద్రతకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

అయితే భారత్ ముడి చమురు దిగుమతుల్లో రష్యా ప్రాధాన్యం మాత్రం కొనసాగుతోంది. కెప్లర్ డేటా ప్రకారం ఆగస్టులో రష్యా నుంచి భారత్‌కు వచ్చిన ముడి చమురు దిగుమతులు స్వల్పంగా తగ్గి రోజుకు 2.1 మిలియన్ బ్యారెళ్ల స్థాయికి చేరుకున్నాయి. అయినప్పటికీ మొత్తం దిగుమతుల్లో దాదాపు 40 శాతం వాటాతో రష్యానే భారత్‌కు అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా కొనసాగుతోంది.

ఒకవైపు రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటూనే.. మరోవైపు అదే దేశానికి శుద్ధి చేసిన పెట్రోల్‌ను ఎగుమతి చేయడం ద్వారా భారత్ తన రిఫైనింగ్ సామర్థ్యాన్ని, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## హైదరాబాద్--బీజాపూర్ హైవే పనుల పరిశీలన

వికారాబాద్, ఆగస్టు 30 వికారాబాద్ పర్యటనకు వెళ్తున్న సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హైదరాబాద్--బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. చేవెళ్ల సమీపంలోని మల్కాపూర్ వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులు వివరించగా, పనుల నాణ్యత, వేగంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రోడ్డు మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మెరుగైన రహదారుల ద్వారా ప్రాంతాల మధ్య అనుసంధానం పెరగడంతో పాటు ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు సృష్టించబడుతున్నాయని పేర్కొన్నారు.

తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణ, ఆధునికీకరణ ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పరిశ్రమలు, వ్యాపార రంగాలకు కూడా ఊతం లభిస్తుందని మంత్రి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య దూరాలు తగ్గి ప్రజలకు ప్రయాణ సౌకర్యం మరింత సులభతరం అవుతుందని చెప్పారు. హైదరాబాద్--బీజాపూర్ హైవే అభివృద్ధి పూర్తయితే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య రాకపోకలు మరింత వేగవంతం అవుతాయని, వాణిజ్య కార్యకలాపాలు విస్తరించేందుకు ఇది దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. రహదారి నిర్మాణ పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. రహదారి పనుల పురోగతిపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించిన ఆయన, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. హైవే అభివృద్ధి పూర్తయిన తర్వాత ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని, ప్రయాణ సమయం తగ్గడంతో పాటు భద్రతాయుత రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. రహదారి పనుల వేగవంతమైన అమలుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

## ఆగస్టులో 36 శాతం లోటు వర్షపాతం

మైనస్ 29 నుంచి 60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కేవలం 16 జిల్లాలోనే సాధారణ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏ ఒక్క జిల్లాలోనూ అత్యధిక వర్షపాతం నమోదు కాలేదు. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం చాలా తీవ్రంగా ఉందని ఇప్పటివరకు నమోదైన వర్షపాతం లెక్కలు వెల్లడిస్తున్నాయి. కాగా ఆగస్టులో రాష్ట్ర సగటు వర్షపాతం 215 మి.మీ. కాగా ఇప్పటివరకు కురిసింది కేవలం 133 మి.మీ. మాత్రమే. అంటే ఈ ఒక్క నెలలోనే 36శాతం లోటు వర్షపాతం నమోదైంది. కాగా గత ఏడాది ఇదే నెలలో వదలకుండా భారీ వర్షాలు కురిశాయి. నిరుడు ఆగస్టులో ఏకంగా 377 మి.మీ. వర్షపాతం రికార్డు అయింది. గత ఏడాది ఇదే నెలతో పోల్చితే ఈ ఏడాది ఆగస్టులో ఏకంగా 65శాతం లోటు వర్షపాతం నమోదైంది. అలాగే ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర సగటు వర్షపాతం 565 మి.మీ. కాగా ఈ ఏడాది అది కేవలం 472 మి.మీ.కే పరిమితమైంది. గతేడాది ఇదే సమయానికి అది ఏకంగా 719 మి.మీ. కురిసి రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. హన్మకొండ, వరంగల్, జనగాం, గద్వాల, యాదాద్రి, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్, సూర్యాపేట, ఖమ్మం, వనపర్తి, మహబూబాబాద్, నల్గొండ, ఆదిలాబాద్, నాగర్ కర్నూల్, నారాయణపేట, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

### నేడు, రేపు తేలికపాటి వర్షాలు

తెలంగాణలో కొన్ని చోట్ల సోమ, మంగళ వారాల్లో తేలికపాటి నుంచి కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గడచిన 24 గంటల్లో కరీంనగర్ జిల్లా గంగాధరలో 2.9, పెద్దపల్లి జిల్లా ఎలిగేడులో 2.8 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది.

## 2030 నాటికి 5 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం

వ్యాపార, పెట్టుబడి అవకాశాలను పెంపొందించడంతో పాటు కొత్త రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు అంగీకరించారు. మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ ప్రజా సేవల వ్యవస్థ, కృత్రిమ మేధ, కీలక ఖనిజాలు, ఇంధన రంగం, అంతరిక్ష పరిశోధన వంటి భవిష్యత్ అవసరాలకు సంబంధించిన రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని చర్చల్లో నిర్ణయించారు. ఈ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల మార్పిడి ద్వారా పరస్పర ప్రయోజనాలు పొందే అవకాశాలు ఉన్నాయని ఇరు దేశాల నాయకులు అభిప్రాయపడ్డారు. వ్యాపారవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు మార్కెట్ ప్రాప్యతను మెరుగుపరచడంపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. రవాణా అనుసంధానం, వాణిజ్య మార్గాల విస్తరణ, బ్యాంకింగ్ సేవల బలోపేతం, చెల్లింపు వ్యవస్థల అనుసంధానం వంటి అంశాలపై ఇరు దేశాలు కార్యాచరణ చేపట్టనున్నాయి. దీనివల్ల ద్వైపాక్షిక వాణిజ్యానికి మరింత ఊతం లభించనుంది.

భారత్, ఉజ్బెకిస్తాన్ మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు ఉన్నప్పటికీ ఇటీవల సంవత్సరాల్లో ఆర్థిక, వ్యూహాత్మక సహకారం కూడా వేగంగా విస్తరిస్తోంది. మధ్య ఆసియాలో భారత్ ప్రభావాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ ఒప్పందాలు కీలకంగా మారనున్నాయి. అదే సమయంలో ఉజ్బెకిస్తాన్‌కు కూడా భారత మార్కెట్, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కొత్త అవకాశాలు లభించనున్నాయి. తాష్కెంట్ చర్చల ఫలితంగా ఇరు దేశాల సంబంధాలు కొత్త దశలోకి ప్రవేశించాయని అధికారులు పేర్కొన్నారు. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, ఇంధనం, అంతరిక్షం సహా అనేక రంగాల్లో సహకారం మరింత విస్తరించనుంది. రాబోయే సంవత్సరాల్లో భారత్--ఉజ్బెకిస్తాన్ సంబంధాలు మరింత బలపడే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి..

ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు.

పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. “కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం” అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

## రాజీనామా చేయిస్తారు!

పెరుగుతారని భావిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఉభయకుశలోపరిగా వెళ్లాలనుకుంటే మాత్రం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ పేరుతో పక్కన పెట్టే అవకాశం ఉందంటున్నారు.

### ఢిల్లీకి వెళ్లనున్న కీలక నేతలు..

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి లేదా మంగళవారం ఉదయం ఢిల్లీకి వెళ్లనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి సెప్టెంబరు 1న ఢిల్లీలో కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని పేర్కొంటున్నారు. సీఎంతోపాటు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఢిల్లీకి వెళు తున్నారు. అలాగే మాజీ ఎంపీ కేవీపీ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో సెప్టెంబరు 2న జరగనున్న వైఎస్సార్ అవార్డు ప్రదాన కార్యక్రమంలో పాల్గొనేందుకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ కూడా ఢిల్లీకి వెళుతున్నారు. మరోవైపు ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకోనున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కీలక నాయకత్వం ఢిల్లీలోనే అందుబాటులో ఉండనున్న నేపథ్యంలో కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించి.. కేసీ వేణుగోపాల్ వారి అభిప్రాయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. అధిష్ఠానం పెద్దలతోనూ చర్చించి.. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలోగానే ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు. అయితే.. అసెంబ్లీ సమావేశాలకు ముందు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు తెరలేపితే.. అది కొత్త వివాదాలకు దారి తీస్తుందన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా వారంలోపే ఈ అంశానికి ఫుల్‌స్టాప్ పెట్టాలన్న ఆలోచనతో అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది.

## ప్రశ్నించిన విద్యార్థులను శిక్షించడం సరికాదు

యూనివర్సిటీలు ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు స్వేచ్ఛగా ఆలోచించడం యూనివర్సిటీ స్థాయిలోనే ప్రారంభిస్తారని తెలిపారు. ఢిల్లీలో జరిగిన నేషనల్ లా యూనివర్సిటీ పీజీ విద్యార్థుల 13వ స్నాతకోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. భిన్న దృక్పథాలు, విశ్వాసాలు కలిగిన స్వేచ్ఛా సమాజ నిర్మాణం రాజ్యాంగం లక్ష్యమని, ప్రజా జీవనంలో అసమ్మతికి చోటు ఉన్నప్పుడే అది సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. రాజ్యాంగ రక్షణను పొందే వాక్, భావ, భిన్నాభిప్రాయ స్వేచ్ఛను అసహన మనస్తత్వం నిరాకరిస్తుందని వివరించారు. ప్రముఖ న్యాయ కోవిదులను గుర్తించి సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని జస్టిస్ భుయాన్ సూచించారు. రాజ్యాంగంలోని 124 (3)(సి) దీనికోసమే ఉద్దేశించినా, గత 70 ఏళ్లుగా ఈ సంప్రదాయానికి దూరం కావడం విచారకరమన్నారు. ఇన్నాళ్లలో హైకోర్టు న్యాయమూర్తులు, ప్రాక్టీసలో ఉన్న న్యాయవాదులు తప్పించి, మరెవరూ సుప్రీంకోర్టు బెంచ్‌లను అలంకరించలేదని ఆయన గుర్తుచేశారు.

## కేరళలో చికిత్స... ఏపీలో పాలన

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమావేశాలు నిర్వహిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ అవసరమైన చోట అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. రాష్ట్రంలోని ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధి కోసం చేపట్టిన “గుడి బాట” కార్యక్రమాన్ని పవన్ కళ్యాణ్ సమీక్షించారు. 100కు పైగా పుణ్యక్షేత్రాలకు 205 కిలోమీటర్ల రహదారులను రూ.120 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. పనులు పూర్తయిన తర్వాత నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి మాత్రమే భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే పుట్టపర్తి ప్రాంతంలో ఆలయ రహదారుల అభివృద్ధికి మరో రూ.30 కోట్లు మంజూరు చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న “గ్రేట్ గ్రీన్ వాల్” కార్యక్రమంపై కూడా ఆయన సమీక్ష నిర్వహించారు. 5,499 హెక్టార్లలో 55 లక్షల తాటి విత్తనాలను నాటే లక్ష్యంతో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. విత్తనాల సేకరణ, నాటడం, సంరక్షణ అంశాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపు కోసం రూపొందించిన ఏపీ-గ్రీన్ కార్యాచరణను వేగవంతం చేయాలని సూచించారు. 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించే లక్ష్యంతో జీఐఎస్, జియో ట్యాగింగ్, అగ్రో ఫారెస్ట్రీ, అవెన్యూ ప్లాంటేషన్స్, కాలువ గట్లు, షెల్టర్ బెల్ట్స్, నర్సరీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సిఎస్ఆర్, నాబార్డ్, కార్బన్ ఫైనాన్స్ వంటి వనరులను వినియోగించుకుని నెలవారీ, త్రైమాసిక లక్ష్యాలతో పనులను పర్యవేక్షించాలని సూచించారు. అలాగే ఆదివాసీ ప్రాంతాల్లో “అడవి తల్లి బాట” కార్యక్రమం ద్వారా రహదారి కనెక్టివిటీని మరింత విస్తరించాలని ఆదేశించారు.

పిఠాపురం నియోజకవర్గంలో ఆధ్యాత్మిక, ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించారు. 24 ఆలయాల పునరుద్ధరణకు రూ.17.06 కోట్లు, టీటీడీ కళ్యాణ మండపానికి రూ.2 కోట్లు, 48 భజన మందిరాల నిర్మాణానికి రూ.11.60 కోట్లు కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే పిఠాపురంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.34 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేసే పనులను సమీక్షించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.36.6 కోట్లతో ఏర్పాటు చేస్తున్న క్యాన్సర్ కేంద్రం పనుల పురోగతినీ పరిశీలించారు. అనకాపల్లి జిల్లా కృష్ణంపాలెంలో కాలుష్యంపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి కాలుష్య నియంత్రణ మండలి ద్వారా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు అనుగుణంగా కాలుష్య నియంత్రణ పరికరాలు ఏర్పాటు చేసే వరకు పరిశ్రమను పునఃప్రారంభించరాదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే, చికిత్స కోసం రాష్ట్రానికి దూరంగా ఉన్నప్పటికీ పరిపాలనపై పవన్ కళ్యాణ్ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారనే విషయం స్పష్టమవుతోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

## సిద్ధాంతాలతో ముందుకెళ్తున్న బీజేపీ ప్రయాణం

- **కుటుంబ రాజకీయాలకు భిన్నమని వ్యాఖ్య**
- **వాజ్‌పేయి, మోదీ నాయకత్వాన్ని ప్రస్తావన**
- **రామమందిరం, ఆర్టికల్ 370పై ప్రశంసలు**
- **ప్రజాస్వామ్య విలువలే పార్టీ బలం**
- **ఎంపీ ఈటెల రాజేందర్**

మేడ్చల్, ఆగస్టు 30 మేడ్చల్ మల్కాజిగిరి (అర్బన్) జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన డి. గిరివర్ధన్ రెడ్డి పదవీ బాధ్యతల స్వీకరణ మహోత్సవం, జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుతో కలిసి ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన పార్టీ సిద్ధాంతాలు, దేశాభివృద్ధి, స్వాతంత్ర్య ఉద్యమం, బీజేపీ రాజకీయ ప్రస్థానంపై విస్తృతంగా మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ ఒక వ్యక్తి లేదా కుటుంబానికి చెందిన పార్టీ కాదని, దేశ హితం ప్రధాన లక్ష్యంగా ఏర్పడిన సిద్ధాంత పార్టీ అని స్పష్టం చేశారు. సభలో మాట్లాడిన ఈటెల రాజేందర్, “దేశం ఫస్ట్, పార్టీ నెక్స్ట్, వ్యక్తిగతం లాస్ట్” అనే భావజాలమే బీజేపీ మూల సిద్ధాంతమని పేర్కొన్నారు. పార్టీ తీసుకునే ప్రతి నిర్ణయం దేశ ప్రయోజనాల కోసమే ఉంటుందని, స్వప్రయోజనాల కోసం కాదని చెప్పారు. బీజేపీ ఎన్నికల కోసం మాత్రమే పనిచేసే పార్టీ కాదని, ప్రజల అవసరాలు, దేశ అభివృద్ధి, సామాజిక మార్పుల కోసం నిరంతరం కృషి చేసే ప్రజా కేంద్రిత రాజకీయ సంస్థ అని వివరించారు. ఈ నేపథ్యంలో కొత్త జిల్లా అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. దేశం 80వ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్న తరుణంలో గత చరిత్రను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఈటెల పేర్కొన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం దేశ మౌలిక వసతుల అభివృద్ధికి బలమైన పునాదులు వేసిందన్నారు. స్వర్ణ చతుర్భుజి జాతీయ రహదారి ప్రాజెక్టు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన వంటి కార్యక్రమాలు దేశ ఆర్థికాభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి ఎంతగానో దోహదపడ్డాయని చెప్పారు. సంకీర్ణ ప్రభుత్వ పరిమితులు ఉన్నప్పటికీ దేశ ప్రయోజనాలే లక్ష్యంగా వాజ్‌పేయి పనిచేశారని కొనియాడారు.

నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని ఈటెల తెలిపారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం దశాబ్దాల కల సాకారమైందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల ఆకాంక్షను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. రామమందిర ఉద్యమం వెనుక ఉన్న నాయకుల త్యాగాలు, కృషిని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు దేశ సమైక్యతకు బలమైన నిర్ణయమని ఈటెల అభిప్రాయపడ్డారు. దేశానికి ఒకే జెండా, ఒకే చట్టం ఉండాలనే శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆకాంక్షను మోదీ ప్రభుత్వం కార్యరూపం దాల్చిందన్నారు. దేశ సమగ్రత, జాతీయత భావాలను బలోపేతం చేసే దిశగా తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా వచ్చిన స్వేచ్ఛను దేశ ప్రజలందరికీ సమానంగా అందించాలనే లక్ష్యంతో బీజేపీ పనిచేస్తోందన్నారు. పార్టీ నిర్మాణంలో ప్రజాస్వామ్య విధానాలకు బీజేపీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. పార్టీ పదవులు కుటుంబ వారసత్వం ఆధారంగా కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపిక అవుతాయని చెప్పారు. ప్రధానమంత్రి నుంచి రాష్ట్ర అధ్యక్షుల వరకు ప్రతి నాయకత్వ స్థానానికి సంస్థాగత ప్రక్రియల ద్వారానే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. సిద్ధాంతాలు, క్రమశిక్షణ, దేశభక్తి, ప్రజాసేవ అనే నాలుగు స్తంభాలపై బీజేపీ నిర్మితమైందని, తెలంగాణలో పార్టీ విస్తరణకు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / ఆగస్టు 30 / అక్షరం న్యూస్ -:

ఆగస్టు 31 వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలంసబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం ఆర్డీవోకార్యాలయంలో,జిల్లాలోని అన్నీ మండల పరిషత్ కార్యాలయాలలో ప్రజావాణి నిర్వహించబడుతుందని తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో ఆదివారం కోరారు.

## మార్పు కోసమే ఢిల్లీ పోరు యాత్ర

- **భద్రాద్రి జిల్లా నుంచి 500 మంది తరలింపు.**
- **నెల రోజుల ప్రచారానికి భారీ స్పందన.**
- **హక్కుల సాధనకు పోరాటాలు తప్పవు.**
- **ఢిల్లీ వేదికగా ఉద్యమ కార్యాచరణ.**
- **సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా.**



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / ఆగస్టు 30 / అక్షరం న్యూస్ -: : దేశంలో మార్పు కోసమే ఢిల్లీ వేదికగా భారీ పోరాట యాత్ర, బహిరంగసభ జరుగుతోందని, ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 500 మంది కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు తరలివెళ్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా తెలిపారు. జిల్లా నుంచి ఢిల్లీకి తరలివెళుతున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల రోజులుగా జిల్లాలోని గ్రామాలు, బస్తీలలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈ నెల 6 నుంచి 14 వరకు నిర్వహించిన జన చైతన్య యాత్రలతో ప్రజల్లో చైతన్యం పెరిగిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రైతాంగం, కార్మిక వర్గం, విద్యార్థులు, మహిళలు ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఢిల్లీలో జరిగే పోరాటంలో జిల్లా ప్రతినిధులు క్రియాశీలకంగా పాల్గొంటారని, అక్కడ తీసుకునే నిర్ణయాల అమలుకు భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, ఉప్పుశెట్టి రాహుల్, కంచర్ల జమలయ్య, మువ్వా వెంకటేశ్వరరావు, డి సుధాకర్, రాజబాబు, సర్పంచులు, కార్పొరేటర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవకురాలు శోభారాణి కి యునైటెడ్ అమెరికా యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్..




కరీంనగర్/హుజురాబాద్/ఆగస్టు 30/అక్షరం న్యూస్:

సామాజిక సేవకురాలు స్పందన సేవ సంస్థ చైర్మన్ అనుమాండ్ల శోభారాణి అంతర్జాతీయ స్థాయిలో యునైటెడ్ అమెరికా యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. శనివారం పుదుచ్చేరిలోని కంబన్ కలైరంగం ఆడిటోరియంలో యునైటెడ్ అమెరికన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో డైరెక్టర్, తమిళనాడు మాజీ న్యాయమూర్తి డాక్టర్ కే వెంకటేశన్ అధ్యక్షతన 'సామాజిక నాయకులు, దార్శనికుల సమ్మేళనం -2026' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శోభారాణి 20 సంవత్సరాలుగా దివ్యాంగుల కోసం చేసిన సేవలు, మహిళా సాధికారత, యువతలో సేవా స్ఫూర్తిని పెంపొందించడం వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ రీజినల్ జాయింట్ డైరెక్టర్ గౌని నరసింహ గౌడ్ తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పిఆర్ సంపత్ లు ఈ డాక్టరేట్ ప్రదానం చేశారు. శోభారాణి కి గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# ఘనంగా దొడ్డి కొమరయ్య సినిమా వాల్ పోస్టర్ ఆవిష్కరణ






జ్యోతి నగర్ ఎన్టిపిసి, ఆగస్టు 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న సినిమా వాల్ పోస్టర్‌ను గోదావరిఖనిలో ఘనంగా ఆవిష్కరించారు. పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద రామగుండం నియోజకవర్గ దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ సహనిర్మాతలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సినిమా ప్రచారంలో భాగంగా ర్యాలీ నిర్వహించి హెచ్ఎంఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. రామగుండం నియోజకవర్గం నుంచి దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణంలో సహనిర్మాతలుగా చేరిన 31 మందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మాణ కమిటీ గౌరవ సలహాదారు, సహనిర్మాత రాదండి బాలయ్య మాట్లాడుతూ తెలంగాణ వీరుల చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ పోరాట చరిత్రలో కీలక పాత్ర పోషించిన వీరుల జీవితాలు మరింతగా ప్రజల్లోకి రావాలని ఆకాంక్షించారు. సినిమా దర్శకుడు ఎం. ేస నా ఎ్ తి మాట్లాడుతూ 243 కులాల ప్రజల భాగస్వామ్యంతో దొడ్డి కొమరయ్య సినిమాను రూపొందించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దొడ్డి కొమరయ్య త్యాగం, తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను ప్రజలకు చేరువ చేయడమే సినిమా ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ గౌరవ అధ్యక్షుడు గంటి శంకరయ్య పటేల్, గౌరవ సలహా దారులు, సహనిర్మాతలు కాసర్ల రాజిరెడ్డి, తోడేటి శంకర్ గౌడ్, గోగుల రాజిరెడ్డి, ఆరెల్లి మల్లేష్, నిర్మాణ కమిటీ చైర్మన్ సాయిరి సాంబయ్య, కోచైర్మన్లు, సహనిర్మాతలు చిన్నాల మల్లయ్య యాదవ్, దేవా భారతి, సహనిర్మాతలు సూర లక్ష్మి, బోదాసు రజిత, ఠాకూర్ లలితాదేవి, బోయరా పంచపూల, గొట్టేపర్తి వెంకటమ్మ, డాక్టర్ లెక్కల నగేష్, కుక్క చంద్రమౌళి, కొమ్మ కుమార్ యాదవ్, కల్లేపల్లి నర్సింగం, ఉదరి స్వామి గౌడ్, గంటి సాయి పటేల్ తేజ్, పెద్దపల్లి జిల్లా నిర్మాణ కమిటీ చైర్మన్, సహనిర్మాత బత్తుల శంకర్, కరీంనగర్ జిల్లా సహనిర్మాత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గిన్నీస్ రికార్డు సర్టిఫికెట్ అందుకున్న నిధిష్ ఠాకూర్







జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : రామగుండం నియోజకవర్గ శాసనసభ్యుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తనయుడు నిధిష్ ఠాకూర్ ప్రతిష్ఠాత్మక గిన్నీస్ వరల్డ్ రికార్డులో భాగస్వామిగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయనకు గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ ధ్రువపత్రం అందింది. హైదరాబాద్‌లో ఈ నెల 9న నిర్వహించిన అతిపెద్ద తైక్వాండో పాఠంలో 533 మంది పాల్గొన్నారు. జయంత్ రెడ్డి ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ, సుమన్ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం గిన్నీస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించింది. ఈ చారిత్రాత్మక రికార్డు కార్యక్రమంలో నిధిష్ ఠాకూర్ పాల్గొనగా, ఆయన భాగస్వామ్యాన్ని గుర్తిస్తూ గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ ధ్రువపత్రాన్ని అందజేసింది. ప్రతిష్ఠాత్మక ప్రపంచ రికార్డులో భాగస్వామిగా నిలవడం పట్ల నిధిష్ ఠాకూర్‌ను పలువురు అభినందించారు. రామగుండం ప్రాంతానికి చెందిన యువకుడు అంతర్జాతీయ స్థాయి రికార్డులో భాగస్వామిగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్సీ మనాలి ఠాకూర్ అభినందించారు.

## సింగరేణి అభ్యున్నతి, యూనియన్ డెవలప్మెంట్ కొరకు విధి విధానాల పై సమావేశం...





- **ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్.**

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / ఆగస్టు 30 / అక్షరం న్యూస్ -:

గత సోమవారం హైదరాబాద్ సెక్రటేరియట్ లో జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్ డా. బి.జనక్ ప్రసాద్ పాల్గొనడం జరిగింది, వారి ఆదేశానుసారం కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ నందు ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్ ఆధ్వర్యంలో ఐఎన్టియుసి నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడమైనది, ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సింగరేణి ప్రస్తుత పరిస్థితులు,కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంస్థ భవిష్యత్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను ఐఎన్టీయూసీ అధినాయక త్వం యాజమాన్యం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది, ముఖ్యంగా సింగరేణి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతన బొగ్గు గనులను ప్రారంభించడం, సింగరేణి సంస్థ బ ి ష య త్ ్త న ం కాపాడేందుకు దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని, కార్మికుల సంక్షేమంతో పాటు సంస్థ ఆర్థిక బలోపేతానికి కొత్త గనులు వస్తేనే అభివృద్ధి అత్యంత అవసరమని పేర్కొన్నారు, అదేవిధంగా సింగరేణి కార్మికులకు సంబంధించిన పెర్క్స్ పై ఆదాయపు పన్ను మినహాయింపు, మారు పేర్ల సమస్య పరిష్కారం, సొంత ఇంటి కల పథకం అమలు చేసే విధంగా చూడాలని, 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటా ప్రకటించి త్వరలో ఇచ్చే విధంగా చూడాలని, కొత్తగూడెం ఏరియాలో అండర్ గ్రౌండ్ లో పని చేయుచున్న జనరల్ అసిస్టెంట్లను సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ గా త్వరగా ఇచ్చే విధంగా చూడాలని డిమాండ్ చేయడం జరిగింది, అలాగే కొత్తగూడెం ఏరియాలో ఉన్న మైన్స్, ఓపెన్ కాస్ట్ మైన్స్ లలో మరియు డిపార్ట్మెంట్ లలో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని కోరడమైనది, అదేవిధంగా యూనియన్ నాయకులు కార్యముకులై కార్మికుల శ్రేయస్సు కోరుతూ కార్మికుల సమస్యలపై త్వరగా స్పందించి పనిచేసే విదంగా చూడాలని కోరారు,ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ బుటిక రాజేశ్వరరావు, సెంట్రల్ మరియు బ్రాంచ్ కమిటీ మెంబర్స్ సకినాల సమ్మయ్య, జిదుల రాజేశ్వరరావు, కాసర్ల సమ్మయ్య, మెంగని అశోక్, పోశం శ్రీనివాస్, రాజశేఖర్, ఫిట్ కార్యదర్శిలు చిలుక రాజయ్య, గోపు కుమారుస్వామి, ఎం.డి.సత్తార్ పాషా, ఈ.మోహన్ రెడ్డి, డి.శంకర్ బాబు, కే.నట్రాజ్, సిహెచ్. సాగర్, జి మల్లికా ర్జునరావు, అసిస్టెంట్ సెక్రటరీలు జల్లి కిరణ్, కే కుమార్, కే. నాగేశ్వరరావు, వల్లాల సాంబమూర్తి, ఎం.డి.సవీర్, నాయకులు ఎస్డి.యాకుబుద్దీన్, నాగుల శంకర్, ఎస్కే ఖాజా పాషా, బాబు దిన్, వెంకట్ స్వామి, రాజేంద్రప్రసాద్, లెనిన్ బాబు, దశరథం, రెడ్డి, రమాకాంత్, దిలీప్, నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ఘనంగా రామడుగు అశ్విని శ్రీనివాసరావు గృహప్రవేశం

- హాజరై శుభాకాంక్షలు తెలిపిన పోల్సాని వేణు రావు, బండారి ప్రశాంత్



కరీంనగర్ / జమ్మికుంట/ఆగస్టు 30/అక్షరం న్యూస్ : జమ్మికుంట మండల పరిధిలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన రామడుగు అశ్విని శ్రీనివాసరావు కరీంనగర్‌లో నూతనంగా నిర్మించిన నివాస గృహప్రవేశ వేడుక ఆదివారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి ముఖ్య అతిథులుగా పోల్సాని వేణు రావు , బండారి ప్రశాంత్ హాజరై నూతన గృహ యజమానులను ఆత్మీయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో అడుగుపెట్టిన కుటుంబానికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, శాంతి సౌభాగ్యాలు ఎల్లప్పుడూ కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం సొంతింటి కలను సాకారం చేసుకోవడం ఎంతో ఆనందకరమైన విషయమని, కుటుంబ సభ్యులందరూ ఐకమత్యంతో, అన్యోన్యంగా సంతోషంగా జీవించాలని కోరుకున్నారు. గ్రామ ప్రజలతో, కుటుంబాలతో ఎల్లప్పుడూ ఆత్మీయ సంబంధాలను కొనసాగిస్తూ, వారి సుఖదుఃఖాల్లో భాగస్వాములవుతూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

## హుజూరాబాద్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ




కరీంనగర్/హుజూరాబాద్/ఆగస్టు 30/అక్షరం న్యూస్:

అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర మూడో మహాసభలను పురస్కరించుకుని హుజూరాబాద్ మండలం ఇందిరానగర్‌లో వాల్ పోస్టర్‌ను ప్రతినిధులు ఘనంగా ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పోలోజు రంజిత్ కుమార్, హుజూరాబాద్ మండల అధ్యక్షురాలు చిట్టి లావణ్యల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పోలోజు రంజిత్ కుమార్, మండల అధ్యక్షురాలు చిట్టి లావణ్యలు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యలు, విద్యా రంగంలో నెలకొన్న సవాళ్లు, ఉపాధి అవకాశాల కల్పన, యువజనుల రాజ్యాంగ బద్ధమైన హక్కుల సాధనే ధ్యేయంగా ఈ మూడో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో యువతను మరింత చైతన్యపరిచి, వారి సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయడానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయని వారు పునరుద్ఘాటించారు. కాబట్టి, హుజూరాబాద్ ప్రాంతంలోని యువకులు, విద్యార్థులు , సమైక్య శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు, ప్రతినిధులు గంగేటి సరళ, పెండాల లావణ్య, ప్రసాద్, చెలిక ప్రసాదు, సతీష్, రాజిరెడ్డి, రాజయ్యలతో పాటు స్థానిక యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బానాజీ పేటలోవిద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభం




జనగామ జిల్లా/రఘునాధపల్లి/(అక్షరం న్యూస్)ఆగస్టు 30: మండలంలోని భాంజీపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన 100 కెవి విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ సర్పంచ్ గైని శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుతో రైతులకు లో-వోల్టేజీ సమస్య తీరడంతో పాటు తరచూ వ్యవసాయ బోరు మోటార్లు కాలిపోయే ప్రమాదం తప్పనుందని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చాట్ల శ్రీనివాస్, వార్డు మెంబర్ పగిడిపల్లి రాజు, అంజిరెడ్డి, శ్రీనివాస్, ఎల్లయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట మండలంలో “గణిత ల్యాబ్” లకు నోచుకోని ప్రభుత్వ పాఠశాలలు

- టీజీ బిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాం .రాజయ్య






కరీంనగర్/జమ్మికుంట/ఆగస్టు 30/అక్షరం న్యూస్:

కరీంనగర్ జిల్లాలోని ఉమ్మడి జమ్మికుంట మండలంలో గల పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో “గణిత ల్యాబ్స్” లేకపోవడంతో ఆయా ఉన్నత పాఠశాలలు పూర్తిగా బోసిపోతున్నాయని గణిత ఉపాధ్యాయుడు టిజి బిటియఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాం. రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ గణిత బోధన సమయంలో టీచింగ్ యాక్టివిటీ కృత్యాలతో పాటు బోధనోపకరణాలు (ఎగ్జిబిట్స్) పరిచయం చేస్తూ విద్యార్థులలో వివిధ నైపుణ్యాలు (స్కిల్స్) పెంపొందించేందుకు సాధనాలుగా ఉపయోగపడే “గణిత ల్యాబ్స్” లపై పూర్తిగా పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ఉమ్మడి జమ్మికుంట మండలంలోని మండల విద్యాశాఖ అధికారులు వైఫల్యం చెందడంతో ఈ పరిస్థితి నెలకొందని వాపోయారు. ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను పలుమార్లు దృష్టికి తీసుకువెళ్లినప్పటికినీ పెదచెవిన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా , కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారిణి చైతన్య జైనీ తదితరులు స్పందించి “గణిత ల్యాబ్స్” ఏర్పాటు చేయాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహించే ప్రధానోపాధ్యాయులపై తగు చర్యలు తీసుకోవాలని “డిమాండ్” చేశారు.

## ఎమ్మార్పీఎస్ ఎంఎస్ పి మండల కమిటీలు ఎన్నిక..



- ఎమ్మార్పీఎస్ మండలఅధ్యక్షుడిగా వేల్పుల ప్రశాంత్ మాదిగ..
- ఎంఎస్ పీ మండల అధ్యక్షుడిగా కాదాస్ ప్రవీణ్..





హనుమకొండ జిల్లాభీమదేవరపల్లి/ఆగస్టు 30/అక్షరం న్యూస్:-

మండలంలోని ముల్కనూరు విశ్వశాంతి హైస్కూల్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. మాట్ల వెంకటస్వామి మాదిగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు మాదిగ కో-ఇన్‌చార్జి తనుగుల విజయ్ మాదిగ హాజరయ్యారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పునర్వ్యవస్థీకరణలో భాగంగా భీమదేవరపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా వేల్పుల ప్రశాంత్ మాదిగ అధికార ప్రతినిధిగా మాడుగుల ప్రణయ్‌దేవ్, ప్రధాన కార్యదర్శిగా మిట్టపల్లి రమేష్, ఉపాధ్యక్షుడిగా ఎర్రబెల్లి దిలీప్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా కాదాస్ ప్రవీణ్, అధికార ప్రతినిధిగా పార్నందుల కుమారస్వామిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాదిగ విజయ్ మాదిగ మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాదిగ యువత సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కండె రమేష్, ఐలపాక స్వామి, తాళ్లపల్లి మధుకర్, వారణందుల సురేష్, తాళ్లపల్లి ఆశీర్వాదం, తాళ్లపల్లి రాజయ్య, కంటే సంజీవ్, సిక సురేష్, మాడుగుల పోచయ్య, మాడుగుల జోసెఫ్, అంబాల చక్రపాణి, చాగంటి వెంకటేశ్వర్లు, కనకం రమేష్, వేమునూరి శ్రీధర్, దప్పు ప్రవీణ్, తాడూరి అజయ్, తాడూరి సన్నీ, వేల్పుల లక్కీ, కనకం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 2262 రోజులుగా పాదరక్షలు లేకుండా స్వామివారికి దీక్ష..

- ఓదెలు యాదవ్‌కు మంత్రి శ్రీధర్‌బాబు అభినందనలు
- శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని హామీ



రామగిరి, పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 30 (అక్షరం న్యూస్): రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులతో మాట్లాడి ఆలయ అభివృద్ధి, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.

గ్రామ ప్రజలను, గ్రామాన్ని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి చల్లగా కాపాడాలని కోరుతూ తాజా మాజీ సర్పంచ్ కొండవేణ ఓదెలు యాదవ్ గత ఆరున్నర సంవత్సరాలుగా దీక్ష కొనసాగిస్తున్నారు. 2262 రోజులుగా పాదరక్షలు లేకుండా స్వామివారిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ దీక్ష కొనసాగిస్తున్న ఓదెలు యాదవ్‌ను మంత్రి శ్రీధర్‌బాబు అభినందించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాగేపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి, ఆలయ అభివృద్ధికి అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, గ్రామ సర్పంచ్ కొండవేణ దివ్య సుధాకర్ యాదవ్, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి, బీసీ సెల్ నాయకులు బండారి సదానందం, గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య, యూత్ నాయకులు కొండవేణ ప్రభాకర్ యాదవ్, మట్ట రాజ్, తాటి శ్రీనివాస్, ఉపసర్పంచ్ యాసం సతీష్, వార్డు సభ్యులు గోపాలకృష్ణ, లక్కపురం శ్రీనివాస్, ఆలయ అర్చకులు సముద్రాల శ్రీనివాస్ చార్యులు, హర్షవర్ధన్, ఇతర గ్రామ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీ నాయకులు కృష్ణయ్య భౌతిక గాయానికి ఘన నివాళులు



భద్రాద్రి కొత్తగూడెం/జూలూరుపాడు/ఆగస్టు30/అక్షరం న్యూస్ : మండల పరిధిలోని సూరారం గ్రామ నివాసి సిపిఎం సీనియర్ నాయకులు సిద్ధి బోయిన కృష్ణయ్య వారి మరణ వార్త తెలియగానే సిపిఎం పార్టీ మండల నాయకత్వం పార్టీ సీనియర్ నాయకులు, సహచరులు మాలోత్ రాములు, వల్ల మల్ల సంజీవరావు, కృష్ణయ్య భౌతికత గాయం పై ఎర్రజెండా కాఫీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి యాస నరేష్ అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం మాట్లాడుతూ సిపిఎం పార్టీ జూలూరుపాడు నిర్మాతలో ఒకరు సూరారం గ్రామ నివాసి కామ్రేడ్ సిద్ధబోయిన కృష్ణయ్య, పార్టీ ఆధ్వర్యంలో సూరారం నిర్మాణం జరిగే సందర్భంలో కీలక భూమి పోషించిన నాయకుడు సిద్ధిపోయిన కృష్ణయ్య అని అలాగే తన జీవితాంతం మాసిస్ పార్టీ కార్యకర్తగా పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నాయకుడని గా సిద్ధిబోయిన కృష్ణయ్య మరణం వారి కుటుంబానికి మరియు ప్రాంత పార్టీ ఉద్యమానికి తీరని లోటు అని ఆయన అన్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యులు ధర్మ మాట్లాడుతూ సిద్దిపేట కృష్ణయ్య తన జీవితాంతం ప్రజల కోసం పార్టీ ఇచ్చే పిలుపుల్లో భాగస్వాములు అవుతూ ఈ ప్రాంత అభివృద్ధికి సూరారం గ్రామంలో పోడు భూములు సాధించే దాంట్లో కీలక భూమిక పోషించిన నాయకుడని ఈ ప్రాంత ఉద్యమ నాయకులు కాసాని ఐలయ్య, చావా సత్యం, యాస కొండలరావులతో కలిసి ఉద్యమ నిర్మాణంలో కీలక భూమిక పోషించారని ఆయన అన్నారు అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యులు వీర్ల రమేష్ మాట్లాడుతూ సిద్దిపేట కృష్ణయ్య మరణానికి విప్లవ జోహార్లు వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు ఓడల వెంకటేశ్వర్లు, పద్మ ,సుగుణ, గార్లపాటి వెంకటి ,వల్లమల్ల చంద్రావు, బోడ అభిమిత్ర, శాఖా కార్యదర్శులు సీతారాములు, కొడెం చంద్రం, ఆనగంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కందులవారిగూడెంలో ఎమ్మార్పీఎస్--ఎంఎంఎస్ నూతన కమిటీలు



సూర్యాపేట/నేరేడుచర్ల, ఆగస్టు 30: అక్షరం న్యూస్

నేరేడుచర్ల మండలం కందులవారిగూడెం గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎంఎస్ నూతన గ్రామ కమిటీల ఎన్నిక సమావేశం నిర్వహించారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నేరేడుచర్ల మండల అధ్యక్షుడు యడవల్లి అరుణ్ మాదిగ అధ్యక్షతన సమావేశం జరిగింది. జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి యడవల్లి చంద్రయ్య మాదిగ సమీక్షలో నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ: అధ్యక్షుడిగా పాల్వాయి మధు మాదిగ, అధికార ప్రతినిధిగా దేవరకొండ కర్ణాకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ఎల్లయ్య మాదిగ, కార్యదర్శులుగా దేవరకొండ సుధాకర్ మాదిగ, రాపోలు సాయికుమార్ మాదిగ, కోశాధికారిగా రాపోలు నాగరాజు మాదిగలను ఎన్నుకున్నారు. ఎంఎంఎస్ గ్రామ కమిటీ: మహిళా అధ్యక్షురాలిగా రాపోలు కృష్ణవేణి, అధికార ప్రతినిధిగా రాపోలు జానకమ్మ, ప్రధాన కార్యదర్శిగా రాపోలు అమల, ఉపాధ్యక్షురాలిగా దేవరకొండ సాలమ్మ, కార్యదర్శిగా రాపోలు గోవిందమ్మలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎంఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన - తాండ్ర వినోద్ రావు

- **వివాహ వేడుకలో పాల్గొన్న భాజపా నాయకులు.**



భద్రాద్రి కొత్తగూడెం/ జూలూరుపాడు/ఆగస్టు30/అక్షరం న్యూస్: మండలంలోని పడమట నర్సాపురం లో గ్రామంలో బీజేపీ పార్టీ జూలూరుపాడు మండలం కార్యదర్శి నిమ్మటూరి రామారావు కుమారుడి వివాహ కార్యక్రమానికి ప్రముఖ నాయకులు తాండ్ర వినోద్ రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులను కలిసి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు మరియు గ్రామ పెద్దలతో ఆప్యాయంగా ముచ్చటించారు. వినోద్ రావు రాకతో వివాహ వేడుకలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అద్యక్షుడు భూక్యా రమేష్ ,రాష్ట్ర నాయకులు గల్లా సత్యనారాయణ,చిలుకూరి రమేష్ మరియు స్థానిక నాయకులు ధారావత్ బాలకిషన్ , గోపాలరావు,రాంబాబు,చరణ్ ,రవి,బాబూలాల్ గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి నరేష్ కు మంత్రి శ్రీధర్‌బాబు అభినందనలు

- **గదా టాటూ అండ్ పియర్సింగ్ స్టూడియో ప్రారంభం**




రామగిరి, పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 30 (అక్షరం న్యూస్): రామగిరి మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొల్లపల్లి రాజమల్లు కుమారుడు గొల్లపల్లి నరేష్ నూతనంగా ఏర్పాటు చేసిన 'గదా టాటూ అండ్ పియర్సింగ్ స్టూడియోను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రిబ్బన్ కట్ చేసి స్టూడియోను ప్రారంభించి, నిర్వాహకుడు గొల్లపల్లి నరేష్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన స్టూడియో దినదినాభివృద్ధి చెందాలని, వ్యాపార రంగంలో యువత మంచి గుర్తింపు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. మంత్రి వెంట మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి, స్థానిక సర్పంచ్ కొండవేణ దివ్య సుధాకర్, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరేష్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నాగేపల్లిలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు





- **ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు**

రామగిరి, పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 30 (అక్షరం): రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. మంత్రి శ్రీధర్‌బాబు వెంట మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, ఉన్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ నిర్వాహకులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి, స్థానిక సర్పంచ్ కొండవేణ దివ్య సుధాకర్, తాజా మాజీ సర్పంచ్ కొండవేనా ఓదెలు యాదవ్, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, ఆలయ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా

## ఎన్‌టీపీసీలో ఉత్సాహంగా 3కే పరుగు












జ్యోతినగర్ ఎన్ టి పి సి ఆగస్టు 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌టీపీసీ రామగుండం క్రీడా మండలి ఆధ్వర్యంలో జ్యోతినగర్‌లోని ఎంజీ స్టేడియంలో శనివారం 3 కిలోమీటర్ల పరుగు పోటీని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌టీపీసీ కార్యనిర్వాహక సంచాలకుడు (ఆర్‌అండ్‌టీ) చందన్ కుమార్ సమంత ప్రారంభించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు క్రీడలు, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ పరుగు పోటీలో వివిధ వయసుల విభాగాలకు చెందిన మొత్తం 226 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. 45 ఏళ్లు పైబడిన వారిలో 40 మంది పురుషులు, ఆరుగురు మహిళలు, 45 ఏళ్లలోపు వారిలో 90 మంది పురుషులు, 50 మంది మహిళలు, అలాగే 40 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఉద్యోగులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఎంజీ స్టేడియం సందడిగా మారింది. ఉద్యోగ విధులకు అతీతంగా కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనే అవకాశం కల్పించడం ద్వారా పరస్పర స్నేహభావం, ఐక్యతతో పాటు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన 3కే పరుగు ఎన్‌టీపీసీ రామగుండంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పింది.



## కొమురయ్య చిత్రంలో గాండ్ల కులవృత్తికి ప్రాధాన్యత ఇవ్వండి





జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చిత్రంలో గానుగతో నూనె ఉత్పత్తి చేసే గాండ్ల కుల వృత్తి పట్ల సందర్భోచితంగా చిత్రీకరించాలని గానుగ వేదిక అధ్యక్షులు డాక్టర్ లెక్కల నగేష్ తెలిపారు. ఆదివారం రోజున గోదావరిఖని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన దొడ్డి కొమురయ్య చిత్రం వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుల సంఘాలు ప్రజాసంఘాలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు, దొడ్డి కొమరయ్య జీవిత చరిత్ర సినిమా నిర్మాత సేనాపతిని గానుగ వేదిక అధ్యక్షులు లెక్కల నగేష్ కోరినట్లు తెలిపారు ఈ సందర్భంగా వివిధ కుల సంఘాల నాయకులను ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గాండ్ల తిలకేశ్వర సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు జక్క మారుతి పాల్గొన్నారు.

## మద్నూర్ వైద్య శాలకు నూతన డాక్టర్లతో మెరుగైన వైద్య సేవలు



**సుప్రీంటెండెంట్ డాక్టర్ ఆనంద్ జాదవ్**

మద్నూర్ / ఆగస్టు 30 ( అక్షరం న్యూస్ -కామారెడ్డి )

రాష్ట్ర సరిహద్దు 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి నూతన డాక్టర్లు, నర్సులు రావడం మెరుగైన వైద్య సేవాలు ఉమ్మడి మండలాల ప్రజలకు అందనున్నాయి. ఆసుపత్రి సుప్రీటెండెంట్ డాక్టర్ ఆనంద్ జాదవ్ మాట్లాడుతూ ఇప్పటి నుండి ప్రభుత్వ వైద్య శాలలో డాక్టర్లు అందుబాటులో ఉండటం జరుగుతుందని తెలిపారు. వీరు తమ ఉద్యోగ బాధ్యతగా డ్యూటీ డాక్టర్ 24 గంటలు వైద్య సేవాలు అందించడం జరుగుతుందని. సుమారు 5 గురు నూతన డాక్టర్లు, 6 గురు కొత్త నర్సులు రావడం జరిగిందని తెలిపారు. సరిహద్దు హాస్పిటల్ ఉండటం తో ఈ ఆసుపత్రికి వైద్య సేవల కోసం మద్నూర్, డోంగ్లీ, జుక్కల్ ప్రాంతాల నుండి రోగస్థులు ఈ ప్రభుత్వ ఆసుపత్రికి రావడం జరుగుతుంది. నూతన డాక్టర్లు రావడం తో రోగస్థులకు ఇప్పటి నుండి మెరుగైన వైద్య సేవాలు లభించునున్నాయి. ప్రవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి మెరుగైన వైద్య సేవాలు, చికిత్సలు నిర్వహించుకోవాలని తెలిపారు. కుని ఆపరేషన్లు కూడా ప్రారంభం కావడం జరిగిందని తెలిపారు. వైరల్ ఫీవల్ ప్రభావం ఉండటం తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా ఆసుపత్రికి వచ్చి వైద్య సేవాలు నిర్వహించుకోవాలని కోరారు. నూతన కొత్త డాక్టర్లలో పిల్లల డాక్టర్, గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, అనస్తియా వారు మద్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు వైద్య సేవాలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. డాక్టర్లకు సహాయకురాలిగా నూతన 6 గురు నర్సులు విధుల్లో చేరడం జరిగిందని తెలిపారు. వైద్యులతో చికిత్సలు నిర్వహించుకొని ఉమ్మడి మండలాల ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. మద్నూర్ 30 పడకల ఆసుపత్రి లో వైద్య సేవల కోసం ఈ క్రింది డాక్టర్లు అందుబాటులో ఉన్నారు.

1) డాక్టర్ ఆనంద్ జాదవ్ ( చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ ).
2) డాక్టర్ కపిల్ ( గైనకాలిస్ట్ ).
3) డాక్టర్ సునీల్ రామ రాథోడ్ ( చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ ).
4) డాక్టర్ షేక్ ముదస్సిర్ ( యం. యస్. సర్జన్ ).
5) డాక్టర్ అజయ్ కుమార్ నాయక్ ( అనస్తియా )
6) డాక్టర్ మొహసిన అఫ్రీన్ ( చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ ).
7) డాక్టర్ సుస్మిత ( గైనకాలిస్ట్ ).
8) డాక్టర్ అలేఖ్య ( అనస్తియా ).
9) డాక్టర్ ప్రత్యుష ( జనరల్ మెడిసిన్ ).
10) డాక్టర్ బీరధార్ ( ఆర్థోపెడిక్ ).


నూతన నర్సుల వివరాలు :

1) దివ్యా భర్తీ ( స్టాఫ్ నర్స్ ).
2) లావణ్య ( స్టాఫ్ నర్స్ ).
3) సుష్మిత ( స్టాఫ్ నర్స్ ).
4) మంజుల ( స్టాఫ్ నర్స్ ).
5) షాజియా ( స్టాఫ్ నర్స్ ).
6) యశోద ( స్టాఫ్ నర్స్ ).

ఈ విధంగా మద్నూర్ 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ఉమ్మడి మండలాల ప్రజలకు కోసం వైద్య సేవాలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.



## రంగం వార్ వరుడు వధువు ను ఆశీర్వదించిన సర్పంచ్ అశోక్ పటేల్



మద్నూర్ / ఆగస్టు 30 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

మద్నూర్ మండలం మెనూర్ గ్రామానికి చెందిన రంగం వార్ పెళ్లి వేడుకల్లో సర్పంచ్ అశోక్ పాల్గొన్నారు. ఆదివారం రోజున మద్నూర్ కేంద్రంలోని లక్ష్మి నారాయణ మందిరంలో నిర్వహించిన పెళ్లి వేడుకలకు హాజరు కావడం జరిగింది. మండపంలో వరుడు రంగవార్ శ్రీకాంత్, వధువు త్రిష కు అక్షంతాలు వేసి ఆశీర్వదించం జరిగింది. వరుడు మామ సాత్విక్ ఆయుర్వేదిక్ డాక్టర్ శ్రీను మండపంలో మెనూర్ గ్రామ సర్పంచ్ అశోక్ పటేల్ కు స్వాగతం పలికి మర్యాద పూర్వలు అందించడం జరిగింది. అశోక్ పటేల్ మాట్లాడుతూ వరుడు వధువు నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో జీవించాలని ఆశీర్వదించడం జరిగింది. వివాహ వేడుకల్లో సర్పంచ్ అశోక్ పటేల్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభం, నంది, శిఖర, ప్రతిష్టాపన



మద్నూర్ / ఆగస్టు 30 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

మద్నూర్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ హనుమాన్ మందిరం ఆలయంలో ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధ్వజస్తంభం, నంది, శిఖర, ప్రతిష్టాపనలు చేశారు. ఈ ఆలయం గ్రామస్తులు తెలిపిన ప్రకారం 150ఏళ్ల పురాతన ఆలయంగా భావిస్తున్నారు. ఈ ఆలయం అభివృద్ధి పరుస్తూ ఆలయం ఎదుట ధ్వజస్తంభం, ఆలయంలో నంది విగ్రహం, ఆలయానికి పైన శిఖర స్థాపన, తదితర అభివృద్ధి పనులను ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి మద్నూర్ వెంకట్, మహేష్, మహారాజ్, కత్గావ్ మల్లికార్జున్ మహారాజ్, ఆధ్వర్యంలో ప్రత్యేక కమలములచే పూజలు నిర్వహించి ప్రతిష్టాపన చేశారు మద్నూరు మండల కేంద్రమైనందున అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో మహన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు ఈ కార్యక్రమం పండుగ వాతావరణంగా కొనసాగింది పార్టీలకు అతీతంగా నాయకులు హాజరయ్యారు. ముఖ్యంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు గ్రామస్తులంత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ ఉషారాణి సంతోష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరస్ వార్ సాయిలు, వార్డు మెంబర్ అయిండ్ల వార్ హన్మాండ్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనాథ ఆశ్రమంలో డాక్టర్ సాంచి వాగ్మారె పుట్టిన వేడుకలు



మద్నూర్ / ఆగస్టు 30 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

డోంగ్లీ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు శివ శంకర్ జ్యోతి వాగ్మారె కుమార్తె డాక్టర్ సాంచి వాగ్మారె పుట్టిన వేడుకలు అనాథ ఆశ్రమంలో నిర్వహించడం జరిగింది. అర్మూర్ లోని అనాథ ఆశ్రమంలో డాక్టర్ సాంచి వాగ్మారె అనాధ పిల్లల సమక్షంలో వారికి అన్నదానం, పండ్లు, ఫలాలు, చాకోలెట్లు, కేట్ తినిపించి అండగా నిలువడం జరిగింది. ఉమ్మడి మండలాల ఆదర్శ ఉపాధ్యాయ దంపతులు జ్యోతి వాగ్మారె ప్రతి సంవత్సరం తన కూతురు యొక్క పుట్టిన రోజు సామజిక సేవాలు, పేద పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, బట్టలు, ఆర్థిక సహాకారం అందిస్తూ పుట్టిన వేడుకలు నిర్వహించడం విశేషం. ఉమ్మడి మండలం తో పాటు జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ వృత్తి, సామజిక సేవాలు అందిస్తూ మంచి పేరు ప్రాక్యతాను శివ శంకర్ జ్యోతి వాగ్మారె సాధించటం విశేషం. డాక్టర్ సాంచి వాగ్మారె పుట్టిన వేడుకల సందర్భంగా బందు మిత్రులు, స్నేహితులు, చరవాణి, సోషల్ మీడియా ద్వారా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనాథ ఆశ్రమంలో పుట్టిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా అనిపించిందాని ఉపాధ్యాయ దంపతులు పెరుకున్నారు.

## పదోన్నతి తో మరింత భాద్యత:సీనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ కోహిర్కర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పదోన్నతి తో బాద్యత మరింత పెరుగుతుందని పెద్దపల్లి జిల్లా న్యాయాసేవాధికార సంస్థ కార్యదర్శి,శ్రీనిజ కోహిర్కర్ అన్నారు.జూనియర్ సివిల్ జడ్జి నుంచి సీనియర్ సివిల్ జడ్జి పదోన్నతి పొందిన ఆమె కు ఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యం లో శనివారం రాత్రి అదనపు జిల్లా న్యాయ స్థాన ఆవరణలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమశీ లో మాట్లాడారు.న్యాయ వాద వృత్తి లో నైపుణ్యాన్ని పెంపొందుంచుకొనేలా ప్రతి ఒక్కరూ కృషి చేసి సీనియర్ ల సలహాలు సూచనలు పాటించాలన్నారు.అనంతరం న్యాయవాదులు న్యాయమూర్తిని ఘనం గా సన్మానించి ,మెమెంటో బహుకరించారు.బార్ అసోసియేషన్ అధ్యక్షులు బల్మూరి అమరేందర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో అదనపు జిల్లా ఏజీపీ శాంతన్ కుమార్,ప్రధాన కార్యదర్శి గుజ్జేటి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ కుమార్ ముచ్చకుర్తి,మహిళా ప్రతినిధి ముక్కెర అంజలి,క్రీడా సంస్కృత కార్యదర్శి అసంపల్లి రవీందర్ ,గ్రంథాలయ కార్యదర్శి గజ్జెల ప్రసన్న నాయకులు జవ్వాజి శ్రీనివాస్ జాగిరి రాజయ్య చిదురల రమేష్ షానవాజ్ దాట్ల కిరణ్ కుమార్ మార్కాపురి తిలక్ తో పాటు సీనియర్ న్యాయవాదులు కిషన్ రావు కొసన శ్రీనివాసరావు సిరిగ సంజయ్ కుమార్ తదితరులున్నారు.

## తూము నరసయ్యకు గిడుగు రామ్మూర్తి అవార్డు



జ్యోతి నగర్ ఎన్టివీసి ఆగస్టు 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ప్రముఖ వ్యాఖ్యాత రచయిత తూము నరసయ్య పటేల్ కు గిడుగు రామ్మూర్తి అవార్డు లభించింది. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తూము రవీందర్ అవార్డు అందజేసి శాలువతో సత్కరించారు.తెలుగు భాషను ప్రజల భాషగా మార్చిన మహనీయుడు గిడుగు రామమూర్తి జయంతి తెలుగు భాష దినోత్సవం సందర్భంగా తూము నర్సయ్య రాసిన "నేను మీ నాను" అనే పుస్తకానికి సాహిత్య రంగములో గిడుగు జాతీయ పురస్కారము 2026 లభించినది. ఈ పురస్కారాన్ని గిడుగు రామమూర్తి మునిమనుమరాలు గిడుగు కాంతి కృష్ణ ఫౌండేషన్ అధ్యక్షుల చేతుల మీదుగా తూము నర్సయ్య కి అందించారు.రెండు తెలుగు రాష్ట్రాలలో మరియు దేశవ్యాప్తంగా 724 మంది కవులలో 20 మందికి మాత్రమే సెలెక్ట్ చేశారు.నరసయ్య అవార్డు అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## గౌతమీ నగర్ లో ఎన్టిపిసి అధికారులు వ్యర్థాల విభజనపై సిబ్బందికి అవగాహన




జ్యోతినగర్ ఎన్టిపిసి, ఆగస్టు 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: రామగుండం ఎన్టీపీసీ పర్యావరణ నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో టౌన్‌షిప్‌లో వ్యర్థాల సేకరణ కార్మికులకు వ్యర్థాల విభజనపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యర్థాలను సక్రమంగా వేరు చేయడం, సురక్షితంగా సేకరించి తరలించడం, శాస్త్రీయ పద్ధతిలో పారవేయడం వంటి అంశాలపై వారికి అవగాహన కల్పించారు. సేకరణ నుంచి తరలింపు వరకు వ్యర్థాల విభజన కొనసాగించాలని, పునర్వినియోగానికి అనువైన వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి సంబంధిత కేంద్రాలకు తరలించాలని సూచించారు.అనంతరం పర్యావరణ నిర్వహణ విభాగం, గౌతమీనగర్ డీఆర్‌సీసీ సమన్వయంతో టౌన్‌షిప్ నివాసితుల కోసం 'వ్యర్థాల నుంచి విలువ' కార్యక్రమాన్ని నిర్వహించారు. నివాసితులు వేరు చేసిన కాగితం, అట్టలు, ప్లాస్టిక్, ఇనుము, ఇతర లోహాలు, గాజు తదితర పునర్వినియోగ వ్యర్థాలను సేకరణకు తీసుకురావాలని ప్రోత్సహించారు.వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేయడం, పునర్వినియోగం చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వాటికి ఆర్థిక విలువ కూడా ఉంటుందని కార్యక్రమంలో వివరించారు. టౌన్‌షిప్ నివాసితులు చురుకుగా పాల్గొనగా, పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన వ్యర్థరహిత టౌన్‌షిప్ నిర్మాణానికి ఎన్టీపీసీ రామగుండం చేస్తున్న కృషిని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.



## తరచూ యాంటీ బయోటిక్స్ వాడుతున్నారా.. దాంతో ఎన్నో అనర్థాలు కలుగుతాయంటున్న నిపుణులు..

జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి వంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే యాంటీబయాటిక్స్ తీసుకోవడం చాలామందిలో సాధారణంగా మారింది. కొన్ని రోజులుగా లక్షణాలు తగ్గకపోయినా లేదా జ్వరం కొనసాగుతున్నా.. బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ అయి ఉండొచ్చనే అనుమానంతో యాంటీబయాటిక్స్ వాడుతుంటారు. అయితే ప్రతి ఇన్ఫెక్షన్‌కు యాంటీబయాటిక్స్ అవసరం ఉండదు. ముఖ్యంగా వైరస్‌ల వల్ల వచ్చే అనారోగ్యాల్లో వీటి వాడకం ప్రయోజనం ఇవ్వకపోగా, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలను చూపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. జలుబు, ఇన్‌ఫ్లుయెంజా, తీవ్రమైన బ్రాంకైటిస్ వంటి సాధారణ అనారోగ్యాల్లో ఎక్కువగా వైరస్‌లే కారణమవుతాయి. యాంటీబయాటిక్స్ మాత్రం బ్యాక్టీరియాపై మాత్రమే పనిచేస్తాయి. కాబట్టి జ్వరం, దగ్గు లేదా గొంతునొప్పి వంటి లక్షణాలు ఉన్నంత మాత్రాన అది బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ అని నిర్ధారించలేమని, సరైన కారణాన్ని గుర్తించిన తర్వాతే తగిన చికిత్స తీసుకోవడం ముఖ్యమని వారు చెబుతున్నారు.

# హుజూరాబాద్‌లో ఘనంగా సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్

**•విజేతలకు బహుమతులు అందజేసిన వొడితల ప్రణవ్**



కరీంనగర్/హుజురాబాద్/ఆగస్టు 30/అక్షరం న్యూస్:

హుజూరాబాద్ బిఎస్ఆర్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన డబ్ల్యూఎఫ్ఎస్కెఓ సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

హుజూరాబాద్ పట్టణంలోని బిఎస్ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన డబ్ల్యూఎఫ్ఎస్కెఓ సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ - 2026 కార్యక్రమానికి హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ముఖ్య అతిథిగా హాజరై వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేసి అభినందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కరాటే వంటి యుద్ధ విద్యలలో తెలంగాణ యువత జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను, పాల్గొన్న క్రీడాకారులను, కోచ్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ రోంటాల సుహాసిని, స్థానిక ప్రజా ప్రజా ప్రతినిధులు కరాటే కోచింగ్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట బాల మేధావికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘన సన్మానం



కరీంనగర్/జమ్మికుంట /ఆగస్టు 30/అక్షరం న్యూస్:

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన 13 ఏళ్ల బాల మేధావి సృష్టి సాయిని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఘనంగా సన్మానించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ) సహాయంతో మొబైల్ కంట్రోల్ , వైఫై ఆధారిత ఫ్లాగ్ హోస్టింగ్ సిస్టమ్‌ను రూపొందించి చిన్న వయసులోనే అద్భుతమైన ఆవిష్కరణ చేసిన సృష్టి సాయిని శాలువాతో సత్కరించి, మెమెంటో అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ...

“13 ఏళ్ల ప్రాయంలోనే సృష్టి సాయి ప్రదర్శించిన సాంకేతిక ప్రతిభ నిజంగా అభినందనీయం. ఈ పిన్న వయసులోనే సాంకేతికతపై పట్టు సాధించి ఏ ఐ ఆధారిత ఫ్లాగ్ హోస్టింగ్ సిస్టమ్ ను రూపొందించడం గొప్ప విషయం. ఇలాంటి బాల మేధావులే భారత భవిష్యత్తుకు దిక్సూచి.దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం డిజిటల్ విప్లవం వైపు వేగంగా దూసుకుపోతోంది. ‘డిజిటల్ ఇండియా’ దార్శనికతతో యువతలో ఏ ఐ, రోబోటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. మోదీ ప్రోత్సాహంతో భారత్ నేడు కేవలం టెక్నాలజీని వినియోగించే దేశంగా కాకుండా, కొత్త టెక్నాలజీలను సృష్టించే గ్లోబల్ హబ్‌గా మారింది.నేటి విద్యార్థులు సాంప్రదాయ చదువులకే పరిమితం కాకుండా, ఏఐ, కోడింగ్ వంటి నైపుణ్యాలను అలవర్చుకోవాలి. సృష్టి సాయి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన ఆవిష్కరణలు చేసి దేశానికి, తెలంగాణకు పేరు తీసుకురావాలని మనసారా ఆశిస్తున్నాను” అని అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సృష్టి సాయి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కొప్పూరులో ఘనంగా పోచమ్మ బోనాలు



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ఆగస్టు 30/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గద్దకుమార్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాల సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులు పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ గద్దకుమార్ స్వామి మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరి శ్రేయస్సు, సుఖసంతోషాల కోసం ప్రతి ఏటా పోచమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన 10వ వార్డు కౌన్సిలర్ తూర్పాటి చందన శంకర్ దంపతులు



కరీంనగర్/జమ్మికుంట/ఆగస్టు 30/ అక్షరం న్యూస్:

జమ్మికుంట పట్టణ మున్సిపాలిటీ 10వ వార్డుకు చెందిన మాణిక్యం మంజుల సదానందం దంపతుల కూతురు వివాహ వేడుకల్లో స్థానిక కౌన్సిలర్ తూర్పాటి చందన శంకర్ దంపతులు ఆదివారం రోజున పట్టణంలోని ఫంక్షన్ హాల్ లో అఖిల్ నిహిత వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులు నిండు నూరేళ్లు అన్యోన్యంగా, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఆదివాసి యువతి ఊకే శిరీష పై లైంగిక దాడికి పాల్పడి హత్య కు కారకులైన దోషులను తక్షణమే శిక్షించాలి.

**•హైద్రాబాద్ తుక్కగూడ లో హత్య కు గురైన ఆదివాసి యువతి కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అదుకోవాలి.**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /ఆగస్టు 30/ అక్షరం న్యూస్: : ఆదివాసీ బిడ్డ ఊకే శిరీష పై లైంగిక అత్యాచారానికి పాల్పడిన దోషులను తక్షణమే శిక్షించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. దేశంలో,రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని సవ్య సమాజం తలదించుకునే రోజులు ఏర్పడుతున్నాయని అన్నారు. ములకలపల్లి మండలం చౌటిగూడెం కాలనీ గ్రామ గ్రామానికి చెందిన ఊకే శిరీష యువతి హైద్రాబాద్ తుక్కగూడ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సు గా విధులు నిర్వహిస్తూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటే తన రౌడీ మూకలు అఘాయిత్యానికి పాల్పడి యువతి పై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచి చంపిన కసాయి రౌడీ మూకలను వెంటనే ఉరి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఆదివాసి యువతి ఊకే శిరీష పై దాడికి పాల్పడిన మనవ మృగం శానాద్ ఉల్లా ఖాన్ ను అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మళ్ళీ ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు చెపట్టాలని డిమాండ్ చేశారు. హత్య కు గురైన యువతి ఊకే శిరీష కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిమ్మల మధు, పాయం అమల, పద్మ, పార్వతీ, రజినీ,సంధ్య, రమాదేవి, మంచాల సారయ్య, గడ్డం వెంకటేశ్వర్లు,గోపగాని లక్ష్మీ నరసయ్య, బైరు ప్రసాద్, మోడే రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# కూలి చేసి చదివించిన తల్లి ఆశలు ఆవిరి

- శిరీష మరణం ఆ కుటుంబానికి తీరని లోటు.
- పేదరికాన్ని ఎదురించి నర్సుగా ఎదిగిన యువతి..
- విధి వెక్కిరించడంతో విషాదాంతం.
- చౌటివారిగూడెంలో విషాద చాయలు..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి /ఆగస్టు 30 /అక్షరం న్యూస్-:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం చౌవిటిగూడెం గ్రామానికి చెందిన ఊకె శిరీష (22) మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. పుట్టిన ఆరు నెలలకే తండ్రి బ్రహ్మయ్య మృతి చెందడంతో, తల్లి రామలక్ష్మి కూలి పనులు చేస్తూ కుమారుడు శివరాం, కుమార్తె శిరీషలను ఎంతో కష్టపడి పెంచింది. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబమైనప్పటికీ, చదువుపై ఉన్న ఆసక్తితో శిరీష కష్టాలను ఎదురించి ముందుకు సాగింది. చౌవిటిగూడెంలో ప్రాథమిక విద్య పూర్తి చేసిన ఆమె, 6 నుంచి 10వ తరగతి వరకు అంకంపాలెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదివింది. 2021-22లో భద్రాచలం గిరిజన బాలికల సంక్షేమ కళాశాలలో ఒకేషనల్ (ఎంఎల్‌టీ) ఇంటర్మీడియట్ పూర్తి చేసి, అనంతరం 2023-25 మధ్య భద్రాచలంలోని మారుతి నర్సింగ్ కళాశాలలో జీఎన్ఎం నర్సింగ్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసింది.?చదువు పూర్తయిన తర్వాత గత డిసెంబర్‌లో హైదరాబాద్‌కు వెళ్లిన శిరీష, నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా ఉద్యోగంలో చేరింది. కష్టాల కడలిని దాటి కూతురు ప్రయోజకురాలైందని, తమ కుటుంబానికి ఆసరాగా ఉంటుందని కలలు కన్న ఆ తల్లికి శనివారం తెల్లవారుజామున అందిన శిరీష మరణవార్త పిడుగులా పడింది. కూలి పనులు చేస్తూ ఏళ్ల తరబడి శ్రమించి బిడ్డను ప్రయోజకురాలను చేసిన తల్లి, కళ్ల ముందే ఎదిగిన కూతురు ఇకలేదన్న నిజాన్ని జీర్ణించుకోలేక కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. పేదరికాన్ని ఓడించి ఉన్నత స్థాయికి ఎదగాలన్న శిరీష ప్రయాణం అర్ధాంతరంగా ముగియడంతో గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

# భగత్ సింగ్ నగర్‌లో మాల మహానాడు యూత్ కమిటీ ఎన్నిక



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి /ఆగస్టు 30 /అక్షరం న్యూస్-:

ములకలపల్లి మండలం భగత్ సింగ్ నగర్‌లో మాల మహానాడు మండల అధ్యక్షులు మోట రవి ఆధ్వర్యంలో యూత్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కమిటీ ?ఈ కమిటీ అధ్యక్షులుగా కొక్కెర గడ్డ సతీష్, ఉపాధ్యక్షులుగా గుమ్మడి రణదేవ్, సెక్రటరీగా మోటా ప్రభాకర్, జాయింట్ సెక్రటరీగా నల్లబల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారులుగా తాళ్ల పవన్ మరియు కొండేటి ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరికొంత మందిని వివిధ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.?ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులకు పలువురు అభినందనలు తెలిపారు. యువత అంతా ఐక్యంగా ఉంటూ మాల మహానాడు సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాలని, సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

# శిరీష మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలి

**•ఆదివాసి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.**

**•అనుమానాస్పద మృతిపై లోతైన దర్యాప్తు అవసరం: మాజీ ఎమ్మెల్యే తాటి.**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి /ఆగస్టు 30/ అక్షరం న్యూస్-:

ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఆదివాసి యువతి శిరీష హైదరాబాద్ తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం పట్ల మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శిరీష మృతిపై కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానాలు లేకుండా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఆమె మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని తాటి వెంకటేశ్వర్లు కోరారు. ఘటనకు ముందు, తర్వాత చోటుచేసుకున్న పరిణామాలను పరిశీలించి, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని అన్నారు. మృతికి అసలు కారణం ఏంటన్నది స్పష్టంగా తేల్చి, దర్యాప్తులో ఎవరైనా బాధ్యులుగా తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఉద్యోగం కోసం స్వగ్రామానికి దూరంగా వెళ్లిన ఆదివాసి యువతి అనుమానాస్పదంగా మృతి చెందడం ఆందోళన కలిగించే విషయమన్నారు. మహిళలు పనిచేసే ప్రాంతాల్లో వారి భద్రతకు అవసరమైన రక్షణ చర్యలు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు.శిరీష కుటుంబం ప్రస్తుతం తీవ్ర విషాదంలో ఉందని, వారికి ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యులకు తగిన న్యాయం, సహాయం అందేలా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తాటి వెంకటేశ్వర్లు కోరారు. శిరీష మృతికి సంబంధించిన ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.

# కోటమ్మతల్లిని దర్శించుకున్న తాటి

**•వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులకు ఆశీస్సులు.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ ఆగస్టు 30/ అక్షరం న్యూస్-:

ములకలపల్లి మండలం నరసపురం గ్రామంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కోటమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మరీదు చెన్నారావు--హైమావతి దంపతుల కుమారుడు రాంసురేష్, అశ్వినిల వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, నూతన వస్త్రాలను అందజేశారు. దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని తాటి వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మరీదు నాగు, రాజారావు,మోహన్ రావు, యర్రగొర్ల చెన్నారావు, మరీదు చెన్నారావు, ప్రసాద్, పామర్తి హరి బాబు, మరియు కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా ముత్యాలమ్మ తల్లి బోనాల సంబరాలు







భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /ఆగస్టు 30/ అక్షరం న్యూస్-:

ములకలపల్లి మండలం పోగాలపల్లి గ్రామ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో శ్రావణ మాస ముత్యాలమ్మ తల్లి బోనాల సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కాలనీవాసులు గ్రామ పెద్దలు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు.?ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మడకం చర్మప్ప, పాలకుర్తి రత్నభూషణం, గ్రామ కమిటీ అధ్యక్షులు కొమ్మరాజు శ్రీనివాసరావు, సాధన శ్రీనివాసరావు తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ మాసం సందర్భంగా కాలనీ అంతటా పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ముత్యాలమ్మ తల్లిని వేడుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# జగన్నాధపురంలో గ్రోమోర్ కేంద్రం ప్రారంభం





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ ఆగస్టు 30/ అక్షరం న్యూస్-:

?ములకలపల్లి మండలంలోని జగన్నాధపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రోమోర్ కేంద్రాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. సర్పంచ్ కుంజా వినోద్ ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ?ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్నాధపురంలో గ్రోమోర్ కేంద్రం అందుబాటులోకి రావడం రైతులకు ఎంతో ఊరటనిస్తుందన్నారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల రైతులకు అవసరమైన నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ సంబంధిత వస్తువులు ఇకపై స్థానికంగానే లభిస్తాయని తెలిపారు. దీంతో రైతులు వ్యవసాయ సాగు సామగ్రి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగిపోతాయని పేర్కొన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు అందించడంతో పాటు పంటల సాగులోనూ తగు సూచనలు, సలహాలు అందిస్తూ ఈ కేంద్రం రైతులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. రైతులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు. ?అనంతరం గ్రోమోర్ నిర్వాహకులు సర్పంచ్ కుంజా వినోద్‌తో పాటు మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కణితి సత్యనారాయణ, రైతులు అడపా నాగేశ్వర రావు, ఎనుగంటి రాము, పిడియాలా బుజ్జి, వేముల మురళి, సీతాయిగూడెం మాజీ సర్పంచ్ కారం సుధీర్‌లను ఘనంగా సన్మానించారు. ?కోరమండల్ సంస్థ గ్రోమోర్ యాజమాన్యం తెలంగాణ ప్రాంతీయ అధికారులు కృష్ణయ్య, మార్కెటింగ్ అధికారి బాలకిషన్, లక్ష్మణ్, పలువురు రైతులు, అనుబంధ సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చిన్న టాక్లి గ్రామంలో ఘనంగా అన్నబాహు సాటే జయంతి నిర్వహణ






మద్నూర్ / ఆగస్టు 30 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

డోంగ్లీ మండలం చిన్న టాక్లి గ్రామంలో అన్నబాహు సాటే విగ్రహ ప్రతిష్టపన 106 జయంతి ఘనంగా నిర్వహించడం జరిగింది.ఆదివారం రోజున ఈ కార్యక్రమానికి పద్మ శ్రీ అవార్డు గ్రహిత మంద కృష్ణ మాదిగ, జహిరాబాద్ మాజీ ఎంపీ బిబి పాటిల్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే లు సౌదగర్ గంగారాం, హన్మంత్ షిండే, అరుణ తార పాల్గొన్నారు. మందకృష్ణ మాదిగ అన్నబాహు విగ్రహ ప్రతిష్టన చేశారు. కార్యక్రమ సభలో మాజీ ఎమ్మెల్యే లు పద్మ శ్రీ అవార్డు గ్రహిత మందకృష్ణ మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ దత్తు నక్కేవార్ కృషి స్వభావం తో ఒక లక్ష రూపాయలతో విగ్రహాన్ని విరాళం ఇవ్వడం గొప్ప మనస్సు సర్పంచ్ దత్తు ధని తెలిపారు. అందరు అన్నబాహు సాటే అడుగు జాడలలో, అయన సూచించినటువంటి మంచి మార్గాన్ని అనుసరించాలని కోరారు. ఏమార్పియస్ కేవలం రిజర్వేషన్ వర్గీకరణ కోసం పాటు పడకుండా అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కొరకు పాటుపడటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో డోంగ్లీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజానంద్ దేశాయి, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు లక్ష్మణ్ బచా వార్ పటేల్, సిర్పూర్ సర్పంచ్ గజ్జు పటేల్, విలాస్ గైక్వాడ్, అక్షయ్ పటేల్, లాలు నాక్కేవార్, ఉమ్మడి మండలాల ప్రజా ప్రతినిధులు, గ్రామ గ్రామాన నుంచి అన్నబాహు సాటే అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయడం జరిగింది.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఢిల్లీలో సీపీఐ సమరభేరి.



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ఆగస్టు 30/అక్షరం న్యూస్:-

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు భీమదేవరపల్లి మండలం నుంచి సీపీఐ నాయకులు ఆదరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఢిల్లీకి బయలుదేరారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాకముందు సామాన్య ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరలను అందుబాటులోకి తీసుకువస్తామని పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తామని స్విస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి ప్రజలకు పంచుతామని హామీలు ఇచ్చిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించి సామాన్య ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు సీపీఐ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ ఢిల్లీ యాత్రలో సుంచు కుమారస్వామి, రావుల తిరుపతి, నడిగోటి సుధాకర్, స్వప్న, పుష్ప, విజయ, మానవ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆసరా పెన్షన్ దరఖాస్తులకు నేడే ఆఖరి తేదీ

- అర్హులు దరఖాస్తు చేసుకోగలరు.



జమ్మికుంట మున్సిపాలిటీ 11 వార్డు కౌన్సిలర్ పోనగంటి విష్ణువర్ధన్

కరీంనగర్/జమ్మికుంట/ఆగస్టు 30/అక్షరం న్యూస్:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆసరా / చేయూత పెన్షన్లకు కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు సోమవారం (ఆగస్టు 31) చివరి తేదీ అని కౌన్సిలర్ పోనగంటి విష్ణువర్ధన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలు ఆగస్టు 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం తన అధికారిక సర్క్యులర్ లో స్పష్టం చేసిందన్నారు. 57 ఏళ్లు నిండిన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కల్లుగీత, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన వారు వెంటనే మీ-సేవ, ఈ-సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, బర్త్ లేదా స్టడీ సర్టిఫికెట్, ఫోటో తీసుకెళ్లాలని చెప్పారు. ఒక ఇంటిలో 57 సంవత్సరాలు నిండిన వారు ఇద్దరు ఉంటే అందులో ఒక్కరే పెన్షన్ కు దరఖాస్తు చేసుకోవాలని, ఒక ఇంటి నుంచి ఇద్దరు దరఖాస్తు చేసుకుంటే పరిశీలనలో ఒకటి తొలగించబడుతుందని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. కాబట్టి అర్హులైన లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నేడే దరఖాస్తు చేసుకోవాలని కౌన్సిలర్ పోనగంటి విష్ణువర్ధన్ కోరారు.

## ఉద్యమకారులకు ఇంటి స్థలం, పెన్షన్ పై సీఎం సానుకూలం : ఎక్కటి సంజీవరెడ్డి




కరీంనగర్/ఇల్లంతకుంట/ ఆగస్టు 30/ అక్షరం న్యూస్:

తెలంగాణ ఉద్యమకారుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సెక్రటరీ జనరల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి తెలిపారు.ఆదివారం రోజున మండలం రాచపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం రోజు కే.కే కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి కమిటీ తీసుకున్న నిర్ణయాలను వివరించారు.దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారని, ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. అదేవిధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలవారీ పెన్షన్, హెల్త్ కార్డులు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే అంశాలపై కూడా సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు.

ఉద్యమకారుల కోసం ప్రత్యేకంగా వెబ్ సైట్ పోర్టల్ ఏర్పాటు చేసి డిజిటల్ విధానంలో దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారని, ఇలా తీపి కబురు చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.తెలంగాణ కోసం గ్రామాలు, మండలాల్లో పోరాటం చేసిన ప్రతి ఉద్యమకారుడిని గుర్తించి న్యాయం చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలోచిరునాగుల బీరయ్య,మాజీ సర్పంచ్ రాజ్ కుమార్,మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు మహమ్మద్ లాల్,నాగేష్,వనం సదానందం,తల్లపెల్లి సారయ్య,రిటైర్డ్ ఎస్ఐ రాజా అంకుశావళి,డి. వెంకటేష్,మోత్కూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు భారీ బందోబస్తు మధ్య నీట్ పీజీ ప్రవేశ పరీక్ష



రామగిరి, (పెద్దపల్లి జిల్లా), ఆగస్టు 30, అక్షరం న్యూస్:

మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నీట్ పీజీ ప్రవేశ పరీక్ష పోలీసుల భారీ బందోబస్తు మధ్య ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రం వద్ద అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయగా, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు.పరీక్షకు మొత్తం 100 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 98 మంది పరీక్షకు హాజరయ్యారని, ఇద్దరు అభ్యర్థులు గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బి. విష్ణువర్ధన్ తెలిపారు. పరీక్షా కేంద్రానికి ఎవరూ ఆలస్యంగా రాలేదని, పరీక్ష మధ్యలో ఎవరూ బయటకు వెళ్లలేదని ఆయన పేర్కొన్నారు.పెద్దపల్లి డీసీపీ భూక్యా రాంరెడ్డి, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, ఎస్బీ ఏసీపీ నాగేందర్, మంథని సీఐ బుద్దె స్వామి, రామగిరి తహసీల్దార్ సుమన్‌తో పాటు ఇద్దరు పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణలో పరీక్ష సజావుగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీలు

- సెప్టెంబర్ 1న బాలికలకు, 2న బాలురకు పోటీలు
- క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలి: ఎంఈఓ ఎ.కొమురయ్య



రామగిరి, పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 30 (అక్షరం న్యూస్):

రామగిరి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా ఎంపిక పోటీలను సెప్టెంబర్ 1వ తేదీన బాలికలకు, సెప్టెంబర్ 2వ తేదీన బాలురకు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ రామగిరి మండల చైర్మన్, ఎంఈఓ ఎ.కొమురయ్య తెలిపారు. ఉదయం 9 గంటలకు పన్నూరు జేఎన్టీయూ మంథని ప్రాంగణంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో రామగిరి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికలకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రామగిరి మండలం తరఫున డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అండర్-14 విభాగానికి 01-01-2013 తర్వాత, అండర్-17 విభాగానికి 01-01-2010 తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులని ఎంఈఓ ఎ.కొమురయ్య తెలిపారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు జిరాక్స్, స్టడీ సర్టిఫికేట్ జిరాక్స్, ఒక ఫొటోతో పాటు లంచ్ బాక్స్ తీసుకురావాలని సూచించారు.

అదనపు సమాచారం కోసం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ కన్వీనర్, పీడీలు కె.సతీష్ (9494729515), ఖాజాబీ (99852039041), వి.శ్రీనివాస్ (8985424911) లను ను సంప్రదించవచ్చని తెలిపారు.

## పూర్తి నష్టపరిహారం చెల్లించాకే పెన్సింగ్ పనులు చేపట్టాలి

- మేడిపల్లి ఇండస్ట్రియల్ పార్క్ పనులను అడ్డుకున్న భూ నిర్వాసిత రైతులు
- హామీలు అమలు చేయకుండా పనులు ఎలా చేపడతారు? అని ఆగ్రహం



రామగిరి, పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 30 (అక్షరం న్యూస్):

మేడిపల్లి ఇండస్ట్రియల్ పార్క్ పరిధిలో భూ నిర్వాసిత రైతులకు సంబంధించిన భూముల్లో పెన్సింగ్ పనులు చేపట్టడాన్ని రైతులు అడ్డుకున్నారు. తమకు రావాల్సిన పూర్తి నష్టపరిహారం అందజేసిన తర్వాతే పనులు చేపట్టాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. గతంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటన సందర్భంగా భూ నిర్వాసితుల సమస్యలను వారం రోజుల్లో పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీ ఇప్పటివరకు అమలు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించకుండా, పూర్తి నష్టపరిహారం చెల్లించకుండా పెన్సింగ్ పనులు కొనసాగించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మా భూములపై మాకే పూర్తి హక్కు ఉంది. రైతులకు రావాల్సిన పూర్తి నష్టపరిహారం అందే వరకు పెన్సింగ్ పనులను కొనసాగించనివ్వం" అని భూ నిర్వాసితులు స్పష్టం చేశారు. తమ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించి, నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. పెన్సింగ్ పనులను అడ్డుకున్న వారిలో రైతులు కొండు లక్ష్మణ్, బాద్రపు శ్రీనివాస్, ఊనగొండ మధుకర్, కొవ్వూరి సురేష్, పానగంటి ప్రశాంత్, మండల శంకర్, మండల శ్రీనివాస్, బర్ల వెంకన్న, జక్కుల శివ, ఎరుకల బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథపల్లిలో ఘనంగా బోనాల పండుగ



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)ఆగస్టు 30: మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా జరిగింది. గ్రామ దేవతలయిన పోచమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మలకు గ్రామస్థులు భక్తి శ్రద్దలతో బోనాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ బొల్లం ఉమారాణి రాజీవ్, పంచాయతీ కార్యదర్శి బాలకిషన్ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సకాల ఏర్పాట్లు చేశారు.



# వీరభద్రనగర్ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం





- స్థల సేకరణ పూర్తికాగానే గ్రామ పంచాయతీ భవనం మంజూరు.
- మంచినీటి బావి పూడికతీత పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు.
- గ్రామ సమస్యలకు ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం.
- మంత్రి పొన్నం ప్రభాకర్..

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ఆగస్టు 30/అక్షరం న్యూస్:-

వీరభద్రనగర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ పూర్తయిన వెంటనే భవనాన్ని మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామంలోని మంచినీటి బావికి పూడికతీత చేపట్టి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం వీరభద్రనగర్‌లో ఆదివారం పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొర్ర గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం గ్రామస్థుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు.

### సర్పంచ్ వినతులపై సానుకూల స్పందన

గ్రామ సర్పంచ్ కొర్ర గోపాల్ నాయక్ గ్రామంలోని ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తండాల్లో సీసీ రోడ్లు, మంచినీటి బావి పూడికతీత, పైప్‌లైన్ ఏర్పాటు, గిరిజన, బీసీ కమిటీ హాళ్లు, గ్రామ పంచాయతీ భవనానికి స్థలం, పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీ, ఓపెన్ జిమ్, బోర్‌వెల్, మోటార్, పైప్‌లైన్‌తో పాటు ఆంజనేయస్వామి పోచమ్మ ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామంలోని మూతపడిన ప్రభుత్వ పాఠశాలను పునఃప్రారంభించామని, అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పెయింటింగ్ పనులు చేపడతామని తెలిపారు. బీసీ కాలనీ, రెండు తండాల అభివృద్ధికి సహకరిస్తామని చెప్పారు.

### గ్రామానికి రూ.కోట్లలో ప్రయోజనాలు

ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీరభద్రనగర్‌లో నాలుగు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని త్వరలో రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. 55 మందికి చేయూత పింఛన్లు అందుతున్నాయని గృహజ్యోతి పథకం ద్వారా 85 కుటుంబాలకు రూ.20.40 లక్షల మేర ప్రయోజనం చేకూరిందన్నారు.

78 మంది రైతులకు రూ.73.42 లక్షల రుణమాఫీ, 172 మంది రైతులకు రైతుభరోసా కింద రూ.88.47 లక్షలు అందించినట్లు వివరించారు. ముగ్గురు రైతు కుటుంబాలకు రైతుబీమా కింద రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిందన్నారు. తొమ్మిది మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు, 30 కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశామని చెప్పారు.

గ్రామంలో రూ.25 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, మరో రూ.5 లక్షలతో రోడ్ల అభివృద్ధి చేపట్టామని తెలిపారు. మిషన్ భగీరథలో భాగంగా రూ.5 లక్షలతో బోర్‌వెల్, పంప్‌సెట్, పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు చెప్పారు. పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి మక్త నాయక్‌తండా మీదుగా ముస్తఫాపూర్ వరకు రూ.72 లక్షలతో రహదారి మంజూరైనట్లు తెలిపారు.



### నీటి సంరక్షణకు ప్రాధాన్యం..

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. జలసిరి పథకం కింద ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, ఒక్కో గుంతకు రూ.6,500, పొలం కుంటకు రూ.1.30 లక్షల వరకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని తెలిపారు. రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్టీల్ బ్యాంకులను వినియోగించాలని కోరారు. వీరభద్రనగర్‌లో మూడు మహిళా సంఘాలకు 300 స్టీల్ బ్యాంక్ కిట్లు, హోటళ్లకు స్టీల్ గ్లాసులు అందించినట్లు తెలిపారు.

### యువత క్రీడల్లో రాణించాలి..

యువత మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా మైదానాలకు వెళ్లి క్రీడల్లో పాల్గొనాలని మంత్రి పిలుపునిచ్చారు. గ్రామానికి క్రికెట్ కిట్, వాలీబాల్ సామగ్రితో పాటు ఓపెన్ జిమ్ అందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 173 గ్రామాల్లో క్రీడా సామగ్రి అందించామని చెప్పారు. క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే సర్టిఫికెట్ల ద్వారా ఆర్మీ, పోలీసు శాఖల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని వివరించారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇళ్లపై సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే 3 కిలోవాట్ల వరకు రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి సత్యనారాయణరెడ్డి, ఉద్యానవన అధికారి కమలాకర్‌రెడ్డి, తహసీల్దార్ రాజేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, సర్పంచ్ కొర్ర గోపాల్ నాయక్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు

## పేదోడి సొంతింటి కలకు సర్పంచ్ అండ

- ప్రభుత్వ సహకారంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు -- సొంత డబ్బులతో ఉచితంగా ఇల్లు నిర్మిస్తున్న సర్పంచ్





కరీంనగర్/హుజురాబాద్/ ఆగస్టు 30/ అక్షర న్యూస్:

తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరిగా జీవిస్తున్న ఓ నిరుపేద యువకుడికి సొంతింటి కలను సాకారం చేసేందుకు గ్రామ సర్పంచ్ మానవత్వంతో ముందుకొచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా ఇల్లు మంజూరు కాగా, ఇంటి నిర్మాణానికి అవసరమైన అదనపు ఖర్చులను సైతం తానే భరిస్తూ ఉచితంగా ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు సర్పంచ్ ముందుకు రావడం స్థానికంగా అభినందనలు అందుకుంటోంది. హుజురాబాద్ మండలం శాలపల్లి--ఇందిరానగర్ గ్రామంలోని న్యూ ఇందిరానగర్ కాలనీకి చెందిన రౌతు తరుణ్ తల్లిదండ్రులు లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణ్‌కు సొంత ఇల్లు అనేది ఎన్నో ఏళ్లుగా ఒక కలగానే మిగిలిపోయింది. తరుణ్ పరిస్థితిని గుర్తించిన గ్రామ సర్పంచ్ కోడిగుటి ప్రవీణ్ ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించేందుకు చొరవ తీసుకున్నారు. ప్రభుత్వ సహకారంతో ఇల్లు మంజూరు కావడంతో పాటు, తరుణ్‌కు పూర్తిస్థాయిలో అండగా నిలవాలని నిర్ణయించుకున్న సర్పంచ్ తన సొంత డబ్బులను ఖర్చు చేస్తూ ఇంటి నిర్మాణాన్ని ఉచితంగా పూర్తి చేసి ఇవ్వడానికి ముందుకు వచ్చారు.

### ఘనంగా ఇంటి నిర్మాణ పనులకు శ్రీకారం

ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ఆదివారం ఇంటి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోడిగుటి ప్రవీణ్, ఉపసర్పంచ్, సంబంధిత వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికుల సమక్షంలో ఇంటి స్థలంలో ముగ్గు వేసి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయడమే తమ లక్ష్యమన్నారు. తల్లిదండ్రులు లేని తరుణ్ పరిస్థితిని చూసి, అతనికి సొంతింటి కలను నెరవేర్చడం తన బాధ్యతగా భావించి ముందుకు వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే సహకారంతో పాటు తన సొంత ఖర్చుతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసి తరుణ్‌కు అందిస్తానని పేర్కొన్నారు.

### "నాకు తల్లిదండ్రులు లేరు... సొంతింటి కల నెరవేరుతోంది"

ఇల్లు మంజూరు కావడం, సర్పంచ్ తన సొంత ఖర్చుతో ఉచితంగా ఇల్లు నిర్మించి ఇస్తుండటంపై రౌతు తరుణ్ ఆనందం వ్యక్తం చేశాడు. తనకు తల్లిదండ్రులు ఎవరూ లేరని, ఆర్థిక పరిస్థితులు సరిగా లేక సొంతంగా ఇల్లు నిర్మించుకునే పరిస్థితి లేదని తెలిపాడు. ఇలాంటి సమయంలో సర్పంచ్ కోడిగుటి ప్రవీణ్ తనకు అండగా నిలిచి, ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించడమే కాకుండా తన సొంత డబ్బులతో ఇల్లు నిర్మించి ఇస్తుండటం జీవితంలో మరచిపోలేని సహాయం అని పేర్కొన్నాడు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించేందుకు కృషి చేసిన సర్పంచ్ కోడిగుటి ప్రవీణ్‌తో పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పాలకవర్గ సభ్యులకు తరుణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### పేద కుటుంబానికి అండగా నిలిచిన సర్పంచ్

తల్లిదండ్రులు లేని నిరుపేద యువకుడికి ప్రభుత్వ పథకం ద్వారా ఇల్లు మంజూరు చేయించడంతో పాటు, తన సొంత నిధులతో ఉచితంగా ఇంటి నిర్మాణం చేపట్టడం పట్ల గ్రామస్థులు సర్పంచ్ కోడిగుటి ప్రవీణ్‌ను అభినందిస్తున్నారు. ప్రజా ప్రతినిధి అంటే కేవలం పదవిలో ఉండటం మాత్రమే కాదని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే నిజమైన ప్రజాసేవకు నిదర్శనమని స్థానికులు పేర్కొన్నారు. తరుణ్‌కు సొంతింటి కలను నెరవేర్చేందుకు సర్పంచ్ చేసిన ఈ మానవతా దృక్పథం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం అందించే సహకారానికి తన వంతు చేయూతను జోడించి, తల్లిదండ్రులు లేని ఓ నిరుపేద యువకుడికి ఉచితంగా ఇల్లు నిర్మించి ఇవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 173 గ్రామాలు అభివృద్ధి చెందితేనే నియోజకవర్గ సమగ్రాభివృద్ధి






- గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందిస్తాం.
- ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన లక్ష్యం.
- మంత్రి పొన్నం ప్రభాకర్.

హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/ఆగస్టు 30/అక్షరం న్యూస్): -

హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే నియోజకవర్గం సమగ్రంగా అభివృద్ధి చెందినట్లవుతుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఆదివారం భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం, గొల్లపల్లి, ముస్తఫాపూర్, గట్ల నర్సింగాపూర్, బొల్లోనిపల్లి గ్రామాల్లో మంత్రి పర్యటించారు. ప్రతి గ్రామంలో అధికారులతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడంతో పాటు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్య, వైద్యం, రవాణా తదితర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

### గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తాం

గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి త్వరలోనే నీటిని నింపే బాధ్యత తనదేనని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కాలువల భూసేకరణకు రైతులు సహకరించాలని కోరారు. భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందిస్తోందన్నారు. ముస్తఫాపూర్‌లో గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల కోసం 21.20 ఎకరాల భూమిని రైతులు ఇచ్చారని, సుమారు 20 ఏళ్ల తర్వాత వారికి పరిహారం అందించినట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే ముస్తఫాపూర్‌లో సుమారు 770 ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు.

### రూ.3.74 కోట్లతో రహదారి అభివృద్ధి

ముత్తారం చౌరస్తా నుంచి గట్ల నర్సింగాపూర్ మీదుగా లంబాడీ తండా వరకు రూ.3.74 కోట్లతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ముత్తారంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్నారు.

గట్ల నర్సింగాపూర్‌లో శిథిలావస్థకు చేరిన బస్‌స్టేషన్ స్థానంలో నూతన బస్‌స్టేషన్ మంజూరు చేసి పనులు వెంటనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ స్టేజీ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2021 నుంచి ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టును వారం రోజుల్లో భర్తీ చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న వెటర్నరీ ఆసుపత్రికి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మ్యాజిక్‌ఫిట్ గుంతలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

### గ్రామాల అభివృద్ధికి హామీలు..

గొల్లపల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. గ్రామానికి ఓపెన్ జిమ్, వాటర్ ప్లాంట్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. స్థల సేకరణ పూర్తయి తీర్మానం చేసిన వెంటనే గ్రామ పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు, మహిళా భవనానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తామని తెలిపారు. గొల్లపల్లి--ముత్తారం, గొల్లపల్లి--వీరన్న నాయక్ తండా, గొల్లపల్లి గుడి--వీరభద్రనగర్ రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. ముస్తఫాపూర్‌లో అంగన్వాడీ భవనం, వీవో భవనం, రహదారులు, తాగునీరు తదితర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టును భర్తీ చేయడంతో పాటు అవసరమైతే మరో ఏఎన్‌ఎంను ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. బొల్లోనిపల్లిలో బ్రిడ్జి, రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. హెచ్‌ఎల్‌బీ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బొల్లోనిపల్లి వైపు బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరు చేశామని గట్ల నర్సింగాపూర్--బొల్లోనిపల్లి రహదారిని రూ.1.70 కోట్లతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. గ్రామంలో మరిన్ని సీసీ రోడ్లు పాఠశాల భవనం ఎర్రకుంట పునరుద్ధరణ, సంఘ భవనాలు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### సంక్షేమ పథకాలతో ప్రజలకు అండ..

ప్రజా పాలనలో ఆయా గ్రామాలకు ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, కళ్యాణలక్ష్మి, కొత్త రేషన్ కార్డులు తదితర పథకాల ద్వారా పెద్దఎత్తున ప్రయోజనం చేకూరిందని మంత్రి వివరించారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజలు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండి స్టీల్ బ్యాంకులను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

### రైతులు ఆరుతడి పంటల వైపు మళ్లాలి..

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించుకోవాలని కోరారు. జలసిరి పథకం కింద ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఒక్కో ఇంకుడు గుంతకు రూ.6,500, పొలంకుంటకు రూ.1.30 లక్షల వరకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని తెలిపారు.

### ఈ నెల 31 వరకు పెన్షన్ దరఖాస్తులు..

కొత్త పెన్షన్ల కోసం ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా హెచ్ఐవీ బాధితులు తదితర అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### విద్య వైద్యానికి ప్రాధాన్యం..

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఆయా గ్రామాల్లో పాఠశాలలకు పెయింటింగ్ తదితర పనులు చేపడతామని చెప్పారు.

14--15 ఏళ్ల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు అందుబాటులో ఉన్న టీకాలను వేయించాలని సూచించారు. అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

### యువత క్రీడల్లో రాణించాలి..

యువత మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా క్రీడా మైదానాలకు వెళ్లాలని మంత్రి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని 173 గ్రామాల్లో క్రీడా సామగ్రిని అందిస్తున్నామని తెలిపారు. ఆయా గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్ తదితర క్రీడా సామగ్రితో పాటు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే క్రీడా ధ్రువపత్రాల ద్వారా ఆర్మీ, పోలీసు తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. హుస్నాబాద్ మినీ స్టేడియంలో కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.





### సౌర విద్యుత్‌ను వినియోగించుకోవాలి.

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద ఇంటిపై సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే మూడు కిలోవాట్ల వరకు రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని మంత్రి తెలిపారు. అవసరమైన విద్యుత్‌ను వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకునే అవకాశం ఉందని వివరించారు. రాజకీయం వేరని అభివృద్ధి వేరని మంత్రి స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ సీఈఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి సత్యనారాయణరెడ్డి, ఉద్యానవన అధికారి కమలాకర్‌రెడ్డి, మండల తహశీల్దార్ రాజేష్, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఏపీఎం వేణు, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, సంబంధిత గ్రామాల సర్పంచులు, జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ ఎడ్యుకేషనల్ అవార్డుకు మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడి ఎంపిక



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )ఆగస్టు 30: మండలంలోని వెల్ది మోడల్ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు కందగట్ల గణేష్ ప్రతిష్టాత్మక గ్లోబల్ ఎడ్యుకేషనల్ అవార్డుకు ఎంపికయ్యాడు. అవార్డు ప్రదానోత్సవం 13 సెప్టెంబరు 2026న ఆంధ్రప్రదేశ్ లో ని గుంటూరు మెడికల్ కాలేజీ క్యాంపస్లోని జీఎంసీఏఎస్ఏ ఆడిటోరియంలో జరుగుతుందని అవార్డు నిర్వాహకులు తెలిపారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి పోత్సహించే కార్యక్రమంలో భాగంగా గణేష్ కు ఈ గౌరవం లభించింది. అవార్డుకు గణేష్ ఎంపిక కావడం పట్ల సహచర ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు అభినందనలను తెలిపారు. ఈ సందర్భంగా అవార్డుకు ఎంపికయిన గణేష్ మాట్లాడుతూ అవార్డుకు ఎంపిక కావడం నాపై మరింత బాధ్యతతో పాటు విద్యారంగంలో అంకిత భావంతో పని చేయాలనే స్ఫూర్తిని పెంచనుందన్నారు. అవార్డు ఎంపికకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

## తరచూ యాంటీ బయోటిక్స్ వాడుతున్నారా దాంతో ఎన్నో అనర్థాలు కలుగుతాయంటున్న నిపుణులు



జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి వంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే యాంటీబయాటిక్స్ తీసుకోవడం చాలామందిలో సాధారణంగా మారింది. కొన్ని రోజులుగా లక్షణాలు తగ్గకపోయినా లేదా జ్వరం కొనసాగుతున్నా.. బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ అయి ఉండొచ్చనే అనుమానంతో యాంటీబయాటిక్స్ వాడుతుంటారు. అయితే ప్రతి ఇన్ఫెక్షన్‌కు యాంటీబయాటిక్స్ అవసరం ఉండదు. ముఖ్యంగా వైరస్‌ల వల్ల వచ్చే అనారోగ్యాల్లో వీటి వాడకం ప్రయోజనం ఇవ్వకపోగా, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలను చూపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. జలుబు, ఇన్‌ఫ్లుయెంజా, తీవ్రమైన బ్రాంకైటిస్ వంటి సాధారణ అనారోగ్యాల్లో ఎక్కువగా వైరస్‌లే కారణమవుతాయి. యాంటీబయాటిక్స్ మాత్రం బ్యాక్టీరియాపై మాత్రమే పనిచేస్తాయి. కాబట్టి జ్వరం, దగ్గు లేదా గొంతునొప్పి వంటి లక్షణాలు ఉన్నంత మాత్రాన అది బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ అని నిర్ధారించలేమని, సరైన కారణాన్ని గుర్తించిన తర్వాతే తగిన చికిత్స తీసుకోవడం ముఖ్యమని వారు చెబుతున్నారు.

### యాంటీ బయాటిక్ రెసిస్టెన్స్ పెరిగే ప్రమాదం..

అవసరం లేకుండా ప్రతి సారి యాంటీబయాటిక్ కోర్సు తీసుకోవడం వల్ల యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ సమస్య పెరిగే ప్రమాదం ఉంటుంది. అలాగే యాంటీబయాటిక్ ఉపయోగించినప్పుడు దానికి సున్నితంగా ఉండే బ్యాక్టీరియా నశిస్తాయి. కానీ నిరోధకత కలిగిన బ్యాక్టీరియా మాత్రం బతికి, మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా సమాచారం ప్రకారం, 2023లో ప్రపంచవ్యాప్తంగా సాధారణ ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే ప్రయోగశాలలో నిర్ధారించిన బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లలో ప్రతి ఆరింటిలో ఒకటి యాంటీబయాటిక్ చికిత్సకు నిరోధకత చూపించిందని తేలింది. యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ అనేది కేవలం ఆసుపత్రులకు మాత్రమే సంబంధించిన సమస్య కాదు. అవసరం లేని సందర్భాల్లో యాంటీబయాటిక్స్ వాడటం ద్వారా కూడా ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. భవిష్యత్తులో సాధారణ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లకు కూడా మందులు సమర్థవంతంగా పనిచేయని పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంటుంది. అవసరం లేకుండా యాంటీబయాటిక్స్ తీసుకోవడం వల్ల వ్యక్తిగతంగా కూడా కొన్ని దుష్ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. వికారం, విరేచనాలు, చర్మంపై దద్దుర్లు, ఇతర మందులతో ప్రతికూల పరస్పర చర్యలు, అలెర్జీ వంటి సమస్యలు వస్తాయి. అలాగే జీర్ణక్రియ, రోగనిరోధక వ్యవస్థకు సహాయపడే గట్ మైక్రోబయోమ్ అని పిలిచే శరీరంలోని సూక్ష్మజీవుల సమతుల్యత కూడా దెబ్బతింటుందని నిపుణులు తెలియజేస్తున్నారు. గట్ మైక్రోబయోమ్‌లో మార్పులు ఏర్పడటం వల్ల కొన్ని ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ముఖ్యంగా క్లోస్ట్రిడియాయిడిస్ డిఫిసైల్ వంటి బ్యాక్టీరియా కారణంగా తీవ్రమైన విరేచనాలు, పెద్దప్రేగులో వాపు వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి.

### పూర్తిగా మానడమూ సరికాదు..

ముక్కు నుంచి వచ్చే కఫం పసుపు లేదా ఆకుపచ్చ రంగులోకి మారితే అది తప్పనిసరిగా బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్‌కు సంకేతమని చాలామంది భావిస్తారు. అయితే ఇది సరైన అభిప్రాయం కాదని అనారోగ్య సమయంలో శరీరంలో సహజంగా జరిగే రోగనిరోధక ప్రతిస్పందనలో భాగంగానే నాసికా స్రావం రంగు మారుతుందని, అలాగే జలుబు తగ్గిపోయిన తర్వాత కూడా కొంతకాలం దగ్గు కొనసాగడం వల్ల బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ వచ్చిందని అనుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. అయితే యాంటీబయాటిక్స్‌ను పూర్తిగా నివారించాల్సిన అవసరం లేదు. బ్యాక్టీరియా వ్యాధి ఉన్నట్లు అనుమానం లేదా నిర్ధారణ ఉన్నప్పుడు అవి అవసరమైన చికిత్సగా

## సలాడ్‌లను ఒకేసారి పెద్ద మొత్తంలో తీసుకుంటున్నారా అయితే జాగ్రత్త



సలాడ్ అంటే ఆరోగ్యకరమైన ఆహారం అనే అభిప్రాయం చాలామందిలో బలంగా ఉంది. బర్గర్, పాస్తా వంటి ఆహారాలను పక్కన పెట్టి, కూరగాయలతో నిండిన సలాడ్‌ను ఎంచుకోవడం ఆరోగ్యానికి మంచి నిర్ణయమే అనిపిస్తుంది. అయితే కొందరిలో మాత్రం సలాడ్ తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, భారంగా అనిపించడం, అసౌకర్యం వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. దీనికి కూరగాయలే కారణమని భావించడం సహజం. కానీ అసలు సమస్య సలాడ్‌లోని పదార్థాల కలయిక, అధిక మొత్తంలో పచ్చి ఆహారం తీసుకోవడం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఒక సమతుల్య భోజనంలో శరీరం సులభంగా జీర్ణించుకోగలిగే మోతాదులో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, కాంప్లెక్స్ కార్బొహైడ్రేట్లు, ఫైబర్ ఉండాలి. అయితే సాధారణంగా తీసుకునే చాలా సలాడ్లలో ఫైబర్ ఎక్కువగా, ప్రోటీన్, కేలరీలు తక్కువగా ఉంటాయి. అలాగే ఒకేసారి పెద్ద మొత్తంలో పచ్చి పదార్థాలను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ వాటిని జీర్ణం చేసుకోవడానికి ఎక్కువ శ్రమ పడాల్సి వస్తుంది.

### పెద్ద మొత్తంలో తింటే..

సలాడ్‌లో ఉండే ప్రతి పదార్థం విడివిడిగా చూస్తే ఆరోగ్యకరమైనదే అవుతుంది. కానీ వాటిని ఒకేసారి ఎక్కువ మొత్తంలో కలిపి తినడం వల్ల కొందరిలో కడుపు ఉబ్బరం, గ్యాస్, పొత్తికడుపులో అసౌకర్యం వంటి సమస్యలు వస్తాయి. ముఖ్యంగా ఫెర్మెంటబుల్ కార్బొహైడ్రేట్లుగా పిలిచే ఫాడ్‌మాప్‌లు అధికంగా ఉండే కొన్ని ఆహారాలు సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో ఈ లక్షణాలను ప్రేరేపిస్తాయి. ఉదాహరణకు పచ్చి ఉల్లిపాయల్లో ఫ్రక్టాన్స్, శనగలు, కిడ్నీ బీన్స్‌లో గ్యాలాక్టో-ఒలిగోశాకరైడ్లు ఉంటాయి. కాలీఫ్లవర్, పుట్టగొడుగుల్లో మన్నిటాల్, యాపిల్స్, డ్రై ఫ్రూట్స్‌లో ఫ్రక్టోజ్, సార్బిటాల్ వంటి పదార్థాలు ఉంటాయి. వీటిలో ఒక్కోటి తక్కువ మోతాదులో ఉన్నప్పటికీ, అన్నింటినీ ఒకే గిన్నెలో కలిపి పెద్ద మొత్తంలో తినడం వల్ల జీర్ణవ్యవస్థపై భారం పెరిగి ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఫైబర్ కడుపులో పేరుకుపోయి కుళ్లిపోతుందనే అభిప్రాయం సరైంది కాదు. అన్ని రకాల ఫైబర్‌లు ఒకే విధంగా జీర్ణవ్యవస్థపై పనిచేయవు. సాధారణంగా సమస్య కేవలం పాలకూర లేదా లెట్యూస్ వల్ల రావడం కాదు. ఫెర్మెంటబుల్ కార్బొహైడ్రేట్లు, అధిక మొత్తంలో పచ్చి ఆహారం, ఇప్పటికే సున్నితంగా ఉన్న జీర్ణవ్యవస్థ.. ఇవన్నీ కలిసి ఉబ్బరానికి కారణమయ్యే అవకాశం ఉంటుంది.

### ఫైబర్ పరిమాణాన్ని ఒక్కసారిగా పెంచితే..

వారంలో ఎక్కువగా ఫైబర్ తీసుకోని వారు ఒక్కసారిగా పెద్ద గిన్నె నిండా పచ్చి కూరగాయలను తినడం ప్రారంభిస్తే కూడా ఇబ్బంది కలుగుతుంది. ఫైబర్ తీసుకునే పరిమాణాన్ని ఒక్కసారిగా పెంచడం వల్ల తాత్కాలికంగా కడుపు ఉబ్బరం, అసౌకర్యం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఫైబర్ తీసుకునే అలవాటుకు గట్ మైక్రోబయోమ్ అలవాటు పడటానికి కొంత సమయం అవసరం. అందువల్ల కూరగాయలను పూర్తిగా మానేయడం కంటే, ఫైబర్ తీసుకునే పరిమాణాన్ని క్రమంగా పెంచడం మంచిది. సలాడ్‌లో ఉపయోగించే డ్రెస్సింగ్‌ను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. మార్కెట్‌లో లభించే కొన్ని బాటిల్ డ్రెస్సింగ్స్‌లో ఉల్లిపాయ పొడి, వెల్లుల్లి పొడి, చికోరి రూట్, ఎమల్సిఫైయర్లు, ప్రిజర్వేటివ్‌లు, షుగర్ ఆల్కహాల్స్ వంటి పదార్థాలు ఉంటాయి. సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో ఇవి ఉబ్బరం వంటి సమస్యలను కలిగించే అవకాశం ఉంటుంది. డ్రెస్సింగ్‌లో ఉండే కొవ్వు కూడా కడుపు ఖాళీ అయ్యే ప్రక్రియను నెమ్మదింపజేసి, ఎక్కువసేపు కడుపు నిండినట్లు లేదా భారంగా అనిపించేలా చేసే అవకాశం ఉంటుంది.వండి కూరగాయలు అయితే..

జీర్ణవ్యవస్థ సున్నితంగా ఉన్నవారు ఒక్కసారిగా పెద్ద గిన్నె నిండా పచ్చి కూరగాయల సలాడ్ తినడం కంటే, వండిన కూరగాయలతో ప్రారంభించడం మంచిది. ఆవిరిపై ఉడికించడం, స్వల్పంగా వేయించడం, రోస్ట్ చేయడం లేదా తేలికగా ఉడికించడం వంటి పద్ధతుల్లో కూరగాయలను తీసుకోవడం వల్ల వాటి గట్టి మొక్కల నిర్మాణం కొంత మెత్తబడుతుంది. దీంతో జీర్ణవ్యవస్థ వాటిని సులభంగా నిర్వహిస్తుంది. పచ్చి కూరగాయలను పెద్ద మొత్తంలో ఒకేసారి తినే బదులు, భోజనంలో ఒకటి లేదా రెండు సర్వింగ్స్ వండిన కూరగాయలను చేర్చి, క్రమంగా పరిమాణాన్ని పెంచుకోవాలి. సలాడ్‌ను ప్రధాన భోజనంగా కాకుండా భోజనంలో ఒక భాగంగా తీసుకోవడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. జీర్ణవ్యవస్థకు అనుకూలమైన సలాడ్ తయారు చేసుకోవాలంటే దాన్ని సింపుల్‌గా ఉంచడం మంచిది. సులభంగా జీర్ణమయ్యే కూరగాయలతో ప్రారంభించి, గ్రిల్డ్ చికెన్, చేపలు, గుడ్లు, టోఫు, పనీర్ లేదా టెంపేతో వంటి మంచి ప్రోటీన్ వనరులను చేర్చుకోవాలి.

### ఆరోగ్యకరమైన కొవ్వులు కావాలంటే..

ఆరోగ్యకరమైన కొవ్వుల కోసం తగిన పదార్థాలను కూడా కలిపి తీసుకోవడం మంచిది. అవసరమైతే కొద్దిగా అన్నం, క్వినోవా, మిల్లెట్స్, స్వీట్ పొటాటో లేదా సవర్‌డో వంటి కార్బొహైడ్రేట్ వనరులను కూడా చేర్చుకోవచ్చు. కొన్ని చిన్న మార్పులు కూడా సలాడ్‌ను జీర్ణవ్యవస్థకు మరింత అనుకూలంగా మార్చి తీసుకోవడం మంచిది. పచ్చి ఉల్లిపాయలకు బదులుగా స్ప్రింగ్ ఆనియన్ ఆకులను , యాపిల్స్‌కు బదులుగా బెర్రీలను, కాలీఫ్లవర్, పుట్టగొడుగులకు బదులుగా కీరదోస, క్యారెట్, గుమ్మడికాయ, జుక్కిని లేదా రోస్ట్ చేసిన కూరగాయలను తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. డ్రెస్సింగ్‌ను కూడా వీలైనంత సింపుల్‌గా ఉంచి, సలాడ్‌లో పదార్థాలను అతిగా నింపకుండా చూసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం శిక్షలా అనిపించకూడదు. ఆరోగ్యకరమైనదని భావించి తినే ఆహారం తిన్న తర్వాత తీవ్రమైన అసౌకర్యాన్ని కలిగించాల్సిన అవసరం లేదు. పెద్ద గిన్నె నిండా సలాడ్ తినడమే ఆరోగ్యకరమైన ఆహారానికి కొలమానం కాదు. మన జీర్ణవ్యవస్థ సౌకర్యవంతంగా జీర్ణించుకోగలిగే విధంగా ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, కాంప్లెక్స్ కార్బొహైడ్రేట్లు, ఫైబర్‌ను సమతుల్యంగా కలిపిన భోజనం తీసుకోవడమే అసలు లక్ష్యంగా పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# సింగరేణికి బొగ్గు గ్యాసిఫికేషన్‌తో కొత్త అవకాశాలు

- రూ.37,500 కోట్ల కేంద్ర పథకాన్ని సీరియస్‌గా పరిశీలించాల్సిన అవసరం -- బొగ్గుకు అదనపు విలువ.. పారిశ్రామిక విస్తరణకు అవకాశం

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: బొగ్గు ఉత్పత్తి రంగంలో దేశంలో కీలక సంస్థగా ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తన వ్యాపార వ్యూహాలను మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.37,500 కోట్ల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రోత్సాహక పథకంపై సింగరేణి యాజమాన్యం ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ఈ పథకం ద్వారా సుమారు 7.5 కోట్ల టన్నుల బొగ్గు, లిగ్నైట్‌ను గ్యాసిఫికేషన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్లాంటు, యంత్రాల వ్యయంలో గరిష్ఠంగా 20 శాతం వరకు ప్రోత్సాహకం అందించే విధానం ఉంది. ప్రాజెక్టుల ఎంపిక పోటీ బిడ్డింగ్ విధానంలో జరుగుతుంది.

### బొగ్గును అమ్మడం నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల వైపు

ప్రస్తుతం సింగరేణి ప్రధానంగా బొగ్గు ఉత్పత్తి చేసి విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలకు సరఫరా చేస్తోంది. అయితే గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గును సంశ్లేషిత వాయువుగా మార్చి దాని నుంచి అమోనియా, మెథనాల్, కృత్రిమ సహజవాయువు, రసాయనాలు, ప్రత్యక్ష ఇనుము ఉత్పత్తి వంటి అధిక విలువ కలిగిన ఉత్పత్తులను తయారు చేసే అవకాశం ఉంటుంది. కేంద్రం కూడా ఈ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడమే పథకం ప్రధాన లక్ష్యంగా పేర్కొంది.

### సింగరేణికి ఉన్న అనుకూలత ఏమిటి?

సింగరేణికి ఈ పథకం విషయంలో ప్రధానంగా బొగ్గు లభ్యత, గనుల నిర్వహణలో అనుభవం, రవాణా వ్యవస్థ, పారిశ్రామిక మౌలిక వసతులు వంటి అంశాలు అనుకూలంగా మారే అవకాశం ఉంది. గ్యాసిఫికేషన్‌కు అవసరమైన బొగ్గును సొంత వనరుల నుంచి సమకూర్చుకునే సామర్థ్యం ఉండటం ప్రాజెక్టుకు బలంగా నిలుస్తుంది. అంతేకాకుండా ఇప్పటికే పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందిన రామగుండం--గోదావరిఖని ప్రాంతంలో ఇలాంటి భారీ విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనేక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయి.

### కేవలం గ్యాసిఫికేషన్ ప్లాంటు కాకుండా అనుబంధ పరిశ్రమలకు అవకాశం

సింగరేణి ఒక గ్యాసిఫికేషన్ ప్లాంటును ఏర్పాటు చేయడం ద్వారా ఆగిపోకుండా, దాని నుంచి ఉత్పత్తయ్యే వాయువును ఆధారంగా చేసుకుని ఎరువులు, మెథనాల్, రసాయనాలు, కృత్రిమ సహజవాయువు వంటి అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళిక రూపొందిస్తే మరింత ప్రయోజనం పొందే అవకాశం ఉంది. దీనివల్ల బొగ్గుకు అదనపు విలువ రావడంతో పాటు కొత్త పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వానికి పన్నుల ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. కేంద్రం ఈ పథకం ద్వారా రూ.2.5 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల వరకు అదనపు పెట్టుబడులు ఆకర్షించవచ్చని అంచనా వేస్తోంది. సుమారు 50 వేల ఉద్యోగ అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని కూడా పేర్కొంది.

### సాధ్యాసాధ్యాలపై సమగ్ర అధ్యయనం అవసరం

అయితే గ్యాసిఫికేషన్ ప్రాజెక్టు అంత తేలికైన వ్యవహారం కాదు. భారీ పెట్టుబడి, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, నీరు, విద్యుత్, పర్యావరణ అనుమతులు, ఉత్పత్తులకు మార్కెట్, దీర్ఘకాలిక ముడిసరుకు సరఫరా వంటి అంశాలను ముందుగానే అధ్యయనం చేయాల్సి ఉంటుంది. పరిశ్రమ వర్గాలు కూడా కేవలం ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహకం సరిపోదని, ఉత్పత్తులకు హామీతో కూడిన కొనుగోలు వ్యవస్థ అవసరమని కోరుతున్నాయి.

### కోల్ ఇండియా అభ్యంతరాలు సింగరేణికి హెచ్చరిక

తాజాగా కోల్ ఇండియా కూడా ఈ పథకంలోని కొన్ని నిబంధనలపై కేంద్రానికి అభ్యంతరాలు వ్యక్తం చేయడం గమనార్హం. దరఖాస్తులకు ఇచ్చిన సమయం తక్కువగా ఉండటం, ప్రాజెక్టుకు అనుబంధంగా ఏర్పాటు చేసే స్వీయ విద్యుత్ కేంద్రాల వ్యయాన్ని ప్రోత్సాహకానికి అర్హమైన వ్యయంలో పరిగణించకపోవడం వంటి అంశాలను కోల్ ఇండియా ప్రస్తావించింది. ఇవి సింగరేణికి కూడా కీలకమైన అంశాలే. అందువల్ల పథకంలో పాల్గొనే ముందు నిబంధనలను పూర్తిగా అధ్యయనం చేసి, సింగరేణి ప్రయోజనాలకు అనుగుణంగా అవసరమైన మార్పుల కోసం కేంద్రాన్ని కోరాల్సిన అవసరం ఉంది.

### దిగుమతి బొగ్గుకు అనుమతి.. పోటీ మరింత పెరిగే అవకాశం

ఇటీవల ఈ పథకం కింద దిగుమతి చేసుకున్న బొగ్గును కూడా ఉపయోగించేందుకు కేంద్రం అనుమతించినట్లు సమాచారం వెలువడింది. దేశీయ బొగ్గు లభ్యతలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు ఈ మార్పు చేసినట్లు తెలుస్తోంది. దీనివల్ల ప్రాజెక్టులకు ముడిసరుకు ఎంపికలో వెసులుబాటు కలిగినా, సొంత బొగ్గు వనరులు ఉన్న సింగరేణి తన సహజ ప్రయోజనాన్ని ఆర్థికంగా ఎలా మలుచుకుంటుందన్నది కీలకంగా మారనుంది.

### రామగుండం ప్రాంతానికి కూడా భారీ అవకాశం

సింగరేణి ఈ పథకంలో భాగస్వామ్యం కావాలంటే రామగుండం--గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతాన్ని కూడా ఒక సాధ్యమైన కేంద్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. బొగ్గు గనులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, పారిశ్రామిక మౌలిక వసతులు, రవాణా సదుపాయాలు ఇప్పటికే ఉన్న నేపథ్యంలో ఇక్కడ గ్యాసిఫికేషన్ ఆధారిత విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాల అధ్యయనం చేయడం ప్రయోజనకరంగా ఉంటుంది.

ఆలస్యం చేస్తే అవకాశాన్ని ఇతరులు అందిపుచ్చుకునే ప్రమాదం

కేంద్ర పథకానికి దరఖాస్తుల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమై, తొలి దశ దరఖాస్తులకు సెప్టెంబర్ 7, 2026 వరకు గడువు ఉన్నట్లు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రకటనల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం పథకాన్ని కేవలం మరో ప్రభుత్వ ప్రోత్సాహక పథకంగా కాకుండా భవిష్యత్ వ్యాపార విస్తరణకు ఒక వ్యూహాత్మక అవకాశంగా పరిగణించాల్సిన అవసరం ఉంది.


సింగరేణి ముందడుగు వేస్తే బొగ్గు విలువ పెరుగుతుంది

ఇప్పటివరకు బొగ్గును ఉత్పత్తి చేసి విక్రయించడమే సింగరేణి ప్రధాన వ్యాపార నమూనాగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో బొగ్గుతోనే అధిక విలువ కలిగిన ఉత్పత్తులను తయారు చేసే దిశగా అడుగులు వేయడం సంస్థకు కొత్త ఆదాయ మార్గాలను తెరవవచ్చు. కేంద్ర ఆర్థిక సహాయం, సింగరేణి బొగ్గు వనరులు, రామగుండం ప్రాంత పారిశ్రామిక మౌలిక వసతులు, అనుబంధ పరిశ్రమల అవకాశాలను సమన్వయం చేస్తే ఇది సింగరేణి భవిష్యత్ విస్తరణలో కీలకమైన ప్రాజెక్టుగా మారే అవకాశం ఉంది.

అందువల్ల రూ.37,500 కోట్ల బొగ్గు గ్యాసిఫికేషన్ పథకంపై సింగరేణి తక్షణమే ఉన్నతస్థాయి సాధ్యాసాధ్యాల అధ్యయనం చేపట్టి, సాంకేతిక--ఆర్థిక నివేదిక సిద్ధం చేసి, అర్హత ఉంటే దరఖాస్తు చేయడంతో పాటు కేంద్ర నిబంధనల్లో సింగరేణికి అనుకూల మార్పుల కోసం ప్రయత్నించాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం ఒక గ్యాసిఫికేషన్ ప్రాజెక్టు మాత్రమే కాకుండా సింగరేణి బొగ్గుకు కొత్త మార్కెట్లు, కొత్త పరిశ్రమలు, కొత్త ఉపాధి అవకాశాలు కల్పించే దీర్ఘకాలిక వ్యూహాత్మక అవకాశంగా చూడాల్సిన అవసరం ఉంది.

# గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యం





- 10 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న డ్రైనేజీ పైప్ లైన్ పనులు పూర్తి గ్రామస్తుల హర్షం
- సర్పంచ్ రేణికుంట్ల శ్యామల కుమార్ కు అభినందనలు

కరీంనగర్ /ఇల్లందకుంట/ఆగస్టు 30/అక్షరం న్యూస్ : గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని నిరూపించారు సిరిసేడు గ్రామ సర్పంచ్ రేణికుంట్ల శ్యామల కుమార్. గత పది సంవత్సరాలుగా అసంపూర్తిగా నిలిచిపోయిన డ్రైనేజీ పైప్ లైన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు.గత పాలకుల నిర్లక్ష్యం వల్ల గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి వచ్చి, దోమల బెడద, అనారోగ్య సమస్యలతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ శ్యామల కుమార్ గారు, ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించి, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రేణికుంట్ల శ్యామల కుమార్ మాట్లాడుతూ.. "గ్రామ ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నా బాధ్యత అని గ్రామ అభివృద్ధి నా లక్ష్యమని 10 ఏళ్ల సమస్యను పరిష్కరించడం చాలా సంతోషంగా అన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమే, గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాము" అని అన్నారు. నక నాకు సహకారం అందించిన పాలకవర్గ సభ్యులకు ప్రభుత్వ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.పెండింగ్ పనులు పూర్తి కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ కృషిని కొనియాడుతూ అభినందనలు తెలుపుతున్నారు.



# సౌత్ జోన్ బౌలర్ల విజృంభణ

### తొలి ఇన్నింగ్స్‌లో 195కే నార్త్ ఆలౌట్

బెంగళూరు: దులీప్ ట్రోఫీలో భాగంగా ఆదివారం నుంచి మొదలైన సెమీస్ పోరులో తొలిరోజు సౌత్‌జోన్ బౌలర్లు చెలరేగారు. కర్ణాటక పేసర్ విద్వత్ కావేరప్ప (4/66) నాలుగు వికెట్లు పడగొట్టడంతో మొదట బ్యాటింగ్ చేసిన నార్త్‌జోన్.. 195 పరుగులకే కుప్పకూలింది. కావేరప్పతో పాటు కేరళ బౌలర్ నిధీశ్ (2/36), స్పిన్నర్ త్యాగరాజన్ (2/31) రాణించడంతో నార్త్ కోలుకలేకపోయింది. ఆ జట్టు బ్యాటర్లలో కమ్రాన్ ఇక్బాల్ (76) ఒక్కడే మెరుగ్గా ఆడాడు.
అయితే ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేసిన సౌత్.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 40 రన్స్ చేసింది. జగదీశన్ (34 బ్యాటింగ్), కెప్టెన్ తిలక్ వర్మ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. సెంట్రల్, ఈస్ట్ జోన్ మధ్య జరుగుతున్న రెండో సెమీస్‌లో.. ఈస్ట్ బౌలర్లు రాణించడంతో రజత్ పటీదార్ సారథ్యంలోని సెంట్రల్ తొలి ఇన్నింగ్స్‌లో 266 రన్స్‌కు ఆలౌట్ అయిం ది. రింకూ సింగ్ (60), ఆర్యన్ జుయల్ (46) ఆ జట్టును ఆదుకున్నారు. ఈస్ట్ బౌలర్లలో అభిజిత్ (3/38), ముకేశ్ (3/56), మహ్మద్ షమీ (2/42) మెరిశారు.



# యశ్ యాక్షన్ డ్రామా ప్రేక్షకులను మెప్పించిందా?

'కేజీఎఫ్' ఫ్రాంచైజీ తర్వాత యశ్ నుంచి వస్తున్న సినిమా అనగానే 'టాక్సిక్'పై దేశవ్యాప్తంగా అంచనాలు మొదల య్యాయి. దానికి తగ్గట్టే ఈ సినిమా ప్రచార చిత్రాలు కూడా సినిమాపై ఆసక్తిని పెంచాయి. భారీ తారాగాణంతో, హాలీవుడ్ స్థాయి అత్యున్నత సాంకేతిక విలువలతో, ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో బుధవారం 'టాక్సిక్' విడుదలైంది. మరి అందరి అంచనాలనూ 'టాక్సిక్' నిజం చేసిందా? హీరో యశ్ 'కేజీఎఫ్' మ్యాజిక్ మళ్లీ రిపీట్ అయ్యిందా? తెలుసుకోవాలంటే ముందు కథలోకి వెళ్లాలి.




**కథ**

గంగా(నయనతార), రాయ(యశ్) అక్కాతమ్ముళ్లు. చిన్నతనం లోనే అమ్మానాన్న దూరం కావడంతో రాయను గంగే అమ్మగా మారింది. తన జీవితాన్ని పణ్ణంగా పెట్టి మరీ తమ్ముడ్ని పెంచి పెద్ద చేసింది. చిన్నతనం నుంచీ నేర ప్రపంచంలోనే పెరిగి పెద్ద కావడంతో ఇద్దరూ నేరప్రవృత్తితోనే ఎదుగుతారు. గోవా నేరసామ్రాజ్యానికి తన తమ్ముడ్ని అధిపతిగా చూడాలనుకుంటుంది గంగ. అందుకోసం అప్పటికే గోవాను ఏలుతున్న ఓ మాఫియా డాన్‌తో చేతులు కలుపుతుంది. ఆ గ్యాంగ్‌లో రాయ కీలకమైన వ్యక్తిగా ఎదుగుతాడు. మాఫియా డాన్ కూతురు రెబెక్కా(తార సుతారియా) రాయకు చేరువవుతుంది. ఇద్దరూ ఒకటవుతారు. మరోవైపు ప్రత్యర్థుల దాడులు, ప్రతిదా డులతో కథ సాగుతూ ఉంటుంది. ఇంతలో రాయకు రాయల్ సర్కస్‌లో పనిచేసే నాడియా(కియారా అద్వానీ) పరిచయం అవుతుంది. మానసికంగా, శారీరకంగా కూడా ఇద్దరూ ఒకటవుతారు. ఈ క్రమంలో నాడియా గర్భవతి అవుతుంది. తన కూతురుని కాదని వేరొక అమ్మాయితో రాయా తీరుగుతున్నాడని తెలిసి మాఫియా డాన్ మండి పడతాడు. ఈ క్రమంలో జరిగిన కలామటీలో ఆ మాఫియా డాన్ రాయ్ చేతులో హతుడవుతాడు. అనుకోని పరిస్థితుల్లో శత్రువుల చేతుల్లో రాయా అక్క గంగ, రాయా ప్రేయసి నాడియా చిక్కుకుంటారు. కడుపులో ఉన్న బిడ్డను చంపుతామని బెదిరించి, నాడియా చేతులతోనే గంగను దండగులు చంపిస్తారు.

అక్క చావుకు కారణమైన ప్రియురాలిని రాయ క్షమించాడా? శిక్షించాడా? నాడియా జీవితం ఎలాంటి మలుపు తీసుకున్నది? అక్క కోరిక ప్రకారం రాయా గోవా మాఫియా సామ్రాజ్యానికి అధిపతిగా ఎదిగాడా? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.

**విశ్లేషణ**

చాలా సాధారణమైన కథ. 'కేజీఎఫ్'లో ఎలాగైతే నేర ప్రపంచంలో పెరిగి, డాన్‌గా ఎదుగుతాడో.. ఇందులోనూ దాదాపుగా అంతే. అదే ధోరణిలో కథ సాగింది. అందులో అమ్మ సెంటిమెంట్. ఇందులో అక్క సెంటిమెంట్. తప్పు చేసిన ఓ తండ్రి మానసిక వేదనే ఈ సినిమా కథ అని చెప్పొచ్చు. సినిమా ప్రథమార్థం సాధారణ మాఫియా సినిమాలా అనిపించినా, ద్వితీయార్థం మాత్రం కథ కొత్త మలుపు తీసుకుంటుంది. ఆ మలుపుకు సంబంధించిన సంఘర్షణ ఆడియన్‌కి కొత్తగా అనిపిస్తుంది. ఏదేమైనా అసలు కథ కంటే యాక్షన్ అంశాలకే దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్టు అనిపిస్తుంది. ఆద్యంతం నరుక్కో వడాలు, చంపుకోవడాలు, కాల్చుకోవడాలు, మధ్య మధ్య ఇంటిమేటెడ్ సీన్స్. కుటుంబ ప్రేక్షకులకు కలిసి చూసేలా అయితే సినిమా లేదు. అయితే... రిచ్‌గా, హాలీవుడ్ మేకింగ్‌తో దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సినిమాను తెరకెక్కించింది.

**నటీనటులు**

యశ్ ఇందులో తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేశాడు. తండ్రి రాయకూ, కొడుకు టికెట్ పాత్రకూ సంబంధం ఉండదు. ముఖ్యంగా రాయగా విశ్వరూపం చూపించాడనే చెప్పాలి. కొడుకు పాత్ర కోసం బరువు కూడా తగ్గాడు. ద్వితీయార్థంలో ఆ పాత్ర ఎదుర్కొనే సంఘర్షణ విభిన్నంగా ఉన్నది. యశ్ అక్క గంగగా నయనతార కథలో ప్రాధాన్యత గల పాత్రను పోషించింది. ఇందులో ఆమె యాక్షన్ సీక్వెన్స్ కూడా అదరగొట్టింది. ఇక కియారా అద్వానీ భావోద్వేగపూరితమైన పాత్ర పోషించింది. చక్కగా అభినయించింది. తారా సుతారియా, రుక్మిణీ వసంత్ పాత్రలు గ్లామర్‌కే పరిమితం.

**సాంకేతికంగా**

చెప్పుకోదగ్గ కథ కాదు. మేకింగ్ మాత్రం బావుంది. గీతూ మోహన్‌దాస్ స్క్రీన్‌ప్లేను అర్థం చేసుకోవడం సగటు ప్రేక్షకుడికి కష్టమే. మొత్తం కథ, కథనం విషయంలో కాస్త జాగ్రత్త తీసుకుంటే బావుండేది. నిర్మాతలు డబ్బులు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు పెట్టారు. ఖర్చుపెట్టిన ప్రతి పైసా తెరపై కనిపించింది. ఇక రవి బస్రూర్ నేపథ్య సంగీతం బావుంది. కెమెరా వర్క్ కూడా బావుంది. మొత్తంగా సాంకేతికంగా సినిమా బావుంది. యాక్షన్ సినిమాలను ఇష్టపడే వాళ్లకు ఈ సినిమా నచ్చొచ్చు.

# విచిత్ర గుండె కథతో వచ్చిన సర్వైవల్ థ్రిల్లర్ ఎలా ఉందంటే?

ఎడమవైపు ఉండాల్సిన గుండె కుడివైపు ఉంటే శరీరంపై ఎలాంటి ప్రభావం పడుతుంది? ఆ అరుదైన పరిస్థితిని ఎదు ర్కొన్న హీరో జీవితంలో ఎలాంటి అనూహ్య మలుపులు చోటు చేసుకున్నాయి? ఈ ఆసక్తికరమైన పాయింట్‌తో తెరకెక్కిన చిత్రమే 'కికు చిరంజీవి'. శుభ సాయి వెంకట్ దర్శకత్వంలో కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటించిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కికు ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దీప్తి నడిమింటి నిర్మించారు. ఈశ్వరీరావు, తనికెళ్ల భరణి, శ్రీకాంత్ భరత్ వైవా రాఘవ, గోపరాజు రమణ కీలక పాత్రల్లో నటించారు. మరి ఈ సిని మా ప్రేక్షకులను ఏ మేరకు మెప్పించిందో రివ్యూలో చూద్దాం.

**కథ**

చిరంజీవి (కికు యనమల) అనాథ వృత్తిరీత్యా ఫోటోగ్రాఫర్. అతనికి పుట్టుకతోనే హార్ట్ ఎడమవైపు కాకుండా కుడివైపు ఉండే అరుదైన వైద్య సమస్య ఉంటుంది. మరోవైపు, అనాథ అయిన మను (కశిష్ ఖాన్)ను శ్రీకాంత్ అయ్యంగార్ దత్తత తీసుకుని పెంచుతాడు. ఆమె వివాహం, పిల్లల దత్తత చుట్టూ కథ నడుస్తుంది. మను వివాహం నిశ్చయమైన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించడం, ఆ తర్వాత ఆమె ఫ్రెండ్స్‌తో కలిసి ఫారెస్ట్ ట్రిప్‌కి వెళ్లడం జరుగుతుంది. ఆ టూర్‌ని కవర్ చేయడానికి వెళ్లిన చిరంజీవితో మనుకి పరిచయం ఏర్పడుతుంది. ఫారెస్ట్ నుంచి తిరిగి వచ్చే క్రమంలో అసలు కథ మొదలవుతుంది. ఈశ్వరీరావు ఎంట్రీ, హీరోహీరోయిన్ల పెళ్లి, ఆ తర్వాత ఫస్ట్ నైట్ రోజు జరిగే భారీ ట్విస్ట్ కథను పూర్తిగా మార్చేస్తుంది. అసలు ఒక్క రాత్రిలో ఎడమవైపు ఉండాల్సిన గుండె కుడివైపు ఎలా కొట్టుకుంది? ఆ వెనుక ఉన్న రహస్యం ఏంటి? తనికెళ్ల భరణి పాత్ర నేపథ్యం ఏమిటి? వంటి ప్రశ్నలకు సమాధానమే మిగతా సినిమా.మూవీ రివ్యూలు మరియు ప్రివ్యూలను చదవడం

**విశ్లేషణ**

ఇలాంటి డిఫరెంట్ మెడికల్ కాన్సెప్ట్‌తో సినిమాలు రావడం టాలీవుడ్‌కి కొత్తేమీ కాకపోయినా, దర్శకుడు శుభ సాయి వెంకట్ దీన్ని ఒక థ్రిల్లర్ జోనర్‌లో ప్రజెంట్ చేసే ప్రయత్నం చేయడం అభినందనీయం. సినిమా ప్రారంభంలో హీరోహీరోయిన్ల పరిచయం, ట్రిప్ సన్నివేశాలు కొంత నెమ్మదిగా సాగుతాయి. కొన్ని సీన్లు సాగదీతగా అనిపించినప్పటికీ, ఫారెస్ట్ ఎపిసోడ్ మరియు ఇంటర్వెల్ ముందు వచ్చే ట్విస్ట్ సినిమాపై ఆసక్తిని కలిగిస్తుంది. తొలిభాగంలో డ్రామా మోతాదు కాస్త ఎక్కువైంది. ఇక సెకండాఫ్‌లో అసలు సినిమా కీలక మలుపు తిరుగుతుంది. పూర్తిగా సస్పెన్స్ మరియు థ్రిల్లర్ మోడ్‌లోకి వెళుతుంది. హీరోయిన్ పడే టెన్షన్, హీరో ప్రవర్తనలో వచ్చే మార్పులు ప్రేక్షకులను సీట్లలో కదలకుండా కూర్చోబెడతాయి. ట్విస్ట్‌లు ఒక్కొక్కటిగా రివీల్ అవుతుంటే సినిమా వేగం పుంజుకుంటుంది. క్లైమాక్స్ ఎమోషనలంగా ముగుస్తుంది.

## ఇంగ్లండ్‌దే సిరీస్





లండన్: స్వదేశంలో పాకిస్థాన్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా మరో మ్యాచ్ మిగిలుండగానే ఇంగ్లండ్ 2-0తో సిరీస్‌ను దక్కించుకుంది. లార్డ్స్‌లో ఆదివారం ముగిసిన రెండో టెస్టులో ఆతిథ్య జట్టు నిర్దేశించిన 389 పరుగుల రికార్డు ఛేదనలో పాక్.. 50.5 ఓవర్లకు 194 రన్స్‌కే చేతులెత్తేసి 194 పరుగుల భారీ ఓటమిని మూటగట్టుకుంది. ఛేజింగ్‌లో 14 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయిన ఆ జట్టును సౌద్ షకీల్ (97) గట్టెక్కించే యత్నం చేసినా మిగిలిన బ్యాటర్లు తేలిపోయారు.

## లంక బోర్డుకు ఐసీసీ షాక్




దుబాయ్: వచ్చే ఏడాది ఆరుజట్లతో ఐసీసీ నిర్వహించనున్న అరంగేట్ర మహిళల చాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులను శ్రీలంక నుంచి మరో చోటుకు తరలించేందుకు ఐసీసీ సిద్ధమైంది. శ్రీలంక బోర్డు (ఎస్ఎల్‌సీ) వ్యవహారాలే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. 2023-24 కాలంలో ఆ దేశంలో ఏర్పడిన రాజకీయ అనిశ్చితికి తోడు బోర్డులో అవినీతి, పరిపాలనా వ్యవహారాల్లో అవకతవకలతో ఐసీసీ.. కొన్నిరోజుల పాటు ఎస్ఎల్‌సీని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. నాటి నుంచి ఎస్ఎల్‌సీకి పూర్తిస్థాయిలో పాలక మండలి లేకపోగా ప్రభుత్వం నియమించిన తాత్కాలిక ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ అధికారుల తో వ్యవహారాలు సాగుతున్నాయి. అయితే బోర్డు కార్యకలాపాల్లో ప్రభుత్వ జోక్యాన్ని అనుమతించని ఐసీసీ.. బోర్డుకు ఎన్నికలు నిర్వహి ంచాలని ఐసీసీ సూచించినా ఆ దేశ క్రీడాశాఖ దానిని పెడచెవిన పెట్టడంతో మహిళల చాంపియన్స్ ట్రోఫీ హక్కులను శ్రీలంక కోల్పోనున్నట్టు సమాచారం. ఇదే విషయమై ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ కార్యదర్శి ప్రకాశ్ షఫ్టెర్ మాట్లాడుతూ.. 'అవును, ఆ టోర్నీ శ్రీలంక నుంచి తరలిపోయినట్టే. మరో వేదికలో ఆ టోర్నీ జరుగనుంది. కానీ అదెక్కడనేది మాత్రం ఇప్పుడే చెప్పలేము' అని తెలిపాడు.

## పౌలిని శుభారంభం క్రెజికోవాకు షాక్



న్యూయార్క్: సీజన్ నాలుగో గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో ఇటలీ అమ్మాయి జాస్మిన్ పౌలిని శుభారంభం చేసింది. ఆదివారం లూయిస్ ఆర్మ్‌స్ట్రాంగ్ స్టేడియంలో జరిగిన మహిళల సింగిల్స్ తొలి పోరులో పౌలిని.. 6-3, 3-6, 6-4తో వెరోనిక ఎర్జావెక్ (స్లోవేనియా)ను ఓడించింది. మరో పోరులో రెండుసార్లు గ్రాండ్‌స్లామ్ చాంపియన్ బార్బొరా క్రెజికోవా (చెక్ రిపబ్లిక్)కు మొదటి రౌండ్‌లోనే షాక్ తగిలింది. అన్‌సీడెడ్ కమిల్లా రఖిమొవా (ఉక్రెయిన్).. 7-6 (7/4), 6-2తో క్రెజికోవాను ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది.

## ఆనంద్ ఆల్‌రౌండ్ షో



హైదరాబాద్, తెలంగాణ డీజీపీగా ప్రమోట్ అయ్యాక తాను ఆడిన తొలి లీగ్ మ్యాచ్‌లో సీవీ ఆనంద్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టారు. హెచ్‌సీఏ సీ-డివిజన్ వన్డే లీగ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా హైదరాబాద్ డిస్ట్రిక్ట్‌తో జరిగిన మ్యాచ్‌లో సికింద్రాబాద్ క్లబ్ తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఆయన.. 82 బంతుల్లోనే 21 బౌండరీలు, 5 సిక్స్‌లతో 126 రన్స్ చేశారు. అనంతరం బంతితో 5 ఓవర్లు బౌలింగ్ చేసి వికెట్లేమీ తీయకున్నా 3 మెయిడిన్లు వేసి 8 పరుగులిచ్చారు. డీజీపీ ఆల్‌రౌండ్ షోతో సికింద్రాబాద్ జట్టు 95 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609